Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 26.10.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 21 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## జననేతపై... హత్యాయత్నం

### విశాఖ ఎయిర్‌పోర్టులో దాడి





### కొట్టొచ్చిన భద్రతా వైఫల్యం
### అభిమానుల్లో ఆందోళన

**ఆంధ్రప్రదేశ్ ఒక్క క్షణం నివ్వెర పోయింది... లక్షలాది మంది అభిమానుల గుండెలు ఒక్కసారిగా అదిరిపడ్డాయి... తమ ప్రియతమ నేతకు ఏమీ కాలేదని, చిన్న గాయంతో బయటపడ్డాడని తెలిసాక కోట్లాది మంది మనసులు కుదుటపడ్డాయి.!**

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత, ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డిపై ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 12.30గంటల ప్రాంతంలో విశాఖపట్నం ఎయిర్‌పోర్టు వెయిటింగ్ లాంజ్‌లో హత్యాయత్నం జరిగింది.

(మిగతా 11వ పేజీలో)

## రామకృష్ణ వెళ్ళాడు రస్తోగి వచ్చాడు

పట్టుబట్టారు.. పంతం నెగ్గించుకున్నారు

(వివరాలు 10వ పేజీలో)



● వేంకటరమణుడి సాక్షిగా.. ఏడుకొండలపై...

## 'శ్రీనివాసుడే రాజు'



2లో

- పరువు నష్టం దావా పేరుతో 2 కోట్ల 14 లక్షల రూపాయలు కోర్టు ఫీజుల క్రింద స్వామి వారి నిధి నుండి చెల్లించాడు
- ఎవరి పరువు.. ఎవరికి నష్టం..?
- ఢిల్లీ 'సుప్రీం'ల ఆశీస్సులతో ముఖ్యమంత్రులను సైతం శాసిస్తున్నాడీ అధికారి!
- ఏడున్నరేళ్ళుగా ఏడుకొండలపై తిష్ట వేసుకుని అంతా తానే, అన్నింటా తానే అన్నట్లుగా వ్యవహరిస్తున్నాడు
- ఐఏఎస్ అధికారిగా విధులు వెలగబెడుతూనే రాజకీయ నేతగా ఎదిగే ప్రయత్నాలు మొదలుపెట్టాడు



కీ॥శే॥ శ్రీమతి వేమిరెడ్డి శ్యామలమ్మ గారు

నిర్యాణం: 01-11-2013

## 5వ వర్ధంతి



అనురాగమూర్తి... ఆత్మీయదీప్తి...

అమ్మ

ఆమె ప్రేమానురాగాలే మాకు స్ఫూర్తి

ఆమె నడిపించిన బాటే మాకు కీర్తి

కుమారుడు

**వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**

రాజ్యసభ సభ్యులు

# శ్రీనివాసుడే రాజు

(మొదటి పేజీ తరువాయి)

**తిరుమలలో ఆయన చెప్పిందే వేదం. ఆయన చేసిందే శాసనం. ముఖ్యమంత్రిని కూడా ఈయన ఖాతరు చేయడు. మంత్రులనైతే అసలే పట్టించుకోడు. ఇక యం.పిలు, యం.యల్.ఏలూ అంటే ఏ స్థాయిలో చూస్తాడో మనం ఆలోచించుకోవచ్చు. బడా పారిశ్రామికవేత్తల అడుగులకు మడుగులొత్తుతాడు. ముఖ్యంగా "ఢిల్లీ" సుప్రీంలకు సాష్టాంగ నమస్కారం చేస్తాడు. సుప్రీంలను భూతంలా చూపి ముఖ్యమంత్రులను సైతం బ్లాక్‌మెయిల్ చేస్తాడు. తిరుమలలో దర్శన టిక్కెట్ల విషయంలో ఈయన గీసిందే గీటు. ప్రోటోకాల్ అన్న పదానికి అర్థాన్నే మార్చేసిన ఘనత ఈ అధికారిది.**

2011లో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆయన సోదరుడు నల్లారి కిషోర్ ఆశీస్సులతో తిరుమలలో పాదం మోపిన తిరుమల జె.ఇ.ఓ శ్రీనివాసరాజు ఇక ఆరోజు నుండి ఈరోజు వరకు ఎదురులేని మనిషిగా కొనసాగుతున్నాడు. కేవలం రెండేళ్ళ కాల పరిమితితో డెప్యూటేషన్‌పై వచ్చిన ఈ పెద్దమనిషి అప్పటినుండి ప్రతీ రెండేళ్ళూ పొడిగించుకోవడంతో తనకున్న ఢిల్లీ పవర్ నంతా వాడి సఫలమౌతూ వస్తున్నాడు. సాంబశివరావు వంటి ఎగ్జిక్యూటివ్ అధికారి మినహా మిగిలిన ఇ.ఓలు కూడా శ్రీనివాసరాజు ముందు డమ్మీలుగా విధులు నిర్వహించే పరిస్థితికి తీసుకొచ్చాడు.

చీమ చిటుక్కుమన్నా భూతద్దంలో వార్తలు వేసి విశ్లేషణలు చేసే మీడియా సైతం శ్రీనివాసరాజుకు మోకరిల్లిందంటే ఆయన చాణుక్యత చతురత ఏ స్థాయిలో వుంటుందో ఊహించుకోవచ్చు. నమో ఏడుకొండల వాడా వేంకటరమణా గోవిందా గోవిందా అంటూ ఆధ్యాత్మిక తత్వంతో తిరుమలలో అడుగుపెట్టిన ఆయన ప్రస్థానం ఆధ్యాత్మికత పరాకాష్టకు చేరి అహంకారంగా మారిందంటే "ఢిల్లీ" సుప్రీంల ఆశీస్సులు ఆయనను ఏ స్థాయికి తీసుకెళ్ళాయో మనం ఊహించుకోవచ్చు. ఆయన సారథ్యంలో నిజమైన భక్తికి స్థానం లేదు. ఆ శ్రీ వేంకటేశ్వరుని ప్రసన్నం చేసుకోవాలంటే ముందుగా ఈ శ్రీనివాసుని దయ తప్పదన్న స్థాయికి ఆయన పలుకుబడిని పెంచేసుకున్నాడు.

## ఎవరి పరువు..ఎవరికి నష్టం?

ఇటీవల అత్యంత వివాదాస్పదమైన అంశంగా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'వజ్రం' వివాదంలో వైసిపి యం.పి. విజయసాయిరెడ్డి మాజీ ప్రధాన అర్చకుడు రమణదీక్షితులపై 200కోట్లకు పరువు నష్టం దావా వేయించి టిటిడికి చెందిన స్వామివారి నిధి నుండి 2కోట్ల 14లక్షల రూపాయలు కోర్టు ఖర్చుల క్రింద జమ చేయించగలిగాడంటే ఈ అధికారి పలుకుబడి గురించి మనం ప్రత్యేకంగా చర్చించు కోవాలసిన అవసరం లేదు.

అసలు పరువు ఎవరికి పోయింది? భగవంతుడికా..? ఒకవేళ భగవంతుడికైతే ఆయన పరువు విలువ 200కోట్లేనా..? లేదా ట్రస్టుబోర్డు పరువు పోయిందనుకుంటే... అందుకు స్వామివారి డబ్బులు ఎలా వాడతారు? అదీకాదు... పోయింది ప్రభుత్వ పరువో లేక జె.ఇ.ఓ, ఇ.వో, ఛైర్మెన్‌ల వ్యక్తిగత పరువో అయితే దీనికి స్వామివారి డబ్బుకి ఏం సంబంధం. ఈ ప్రశ్నలన్నింటికీ ఈ రాజావారే సమాధానం చెప్పాలి. ఓ వైపు ముఖ్యమంత్రిని "ఢిల్లీ" నుండి సిఫారసుల ద్వారా బెదిరిస్తూ మరో వైపు చిన్నబాబుని ప్రసన్నం చేసుకునే దిశగా పావులు కదుపుతూ పశ్చిమగోదావరి జిల్లాకు కలెక్టర్‌గా వెళ్ళాలని, అక్కడి నుండి మళ్ళీ ఇవోగా స్వామివారి చెంతకు రావాలనే ప్రయత్నం చేస్తూనే, కుదిరితే రాజకీయ రంగ ప్రవేశం చేసి "నగరి" నియోజకవర్గం నుండి పోటీ చేయాలనే ఆలోచనలో కూడా వున్నట్లు సమాచారం.

తన జాతకం ప్రకారం రాజకీయాలలో రాణిస్తానని, గెలిచి మంత్రిని కూడా అవుతానని తన వ్యక్తిగత జ్యోతిష్కులు చెప్తున్నారని తన అనుంగ మిత్రుల దగ్గర తరచూ చెప్పుకుంటూ ఆ దిశగా ప్రయత్నాలు సాగిస్తున్నాడు. ప్రస్తుతం ఆయన గొంతెత్తితే కోయిల గానం, ఆయన రాగం తీస్తే అన్నమయ్య కీర్తన అంత పవిత్రంగా ఆయన మాటలను చూస్తున్న మీడియా మిత్రులు, టిటిడి అధికార యంత్రాంగం బాబు పాలనలోని నేతలూ ఆయనకు వంత పాడుతుండడంతో ఈయన ఆడంబరానికి, ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. ఓసారి ఈయన గత చరిత్ర, కాలేజీ రోజులూ, వ్యక్తిగత జీవితాలను పరిశీలిస్తే కళ్ళు బైర్లు కమ్మే నిజాలు తెలుస్తున్నాయి. అవన్నీ ఇక్కడ ప్రస్తుతానికి అప్రస్తుతం కాబట్టి మరో సందర్భంలో ముచ్చటించుకుందాం.

## ఈయన లీలలపై దర్యాప్తు చేయాలి..

**- భానుప్రకాష్ ఫిర్యాదు**

గత సెప్టెంబర్ 27వ తేదీన జె.ఇ.ఓ జరిపిన ఆకస్మిక తనిఖీలో శ్రీవారి ఆర్జిత సేవలకు సంబంధించిన టిక్కెట్లలో భారీ అవకతవకలు జరిగినట్లు రుజువైంది. ఈ అవకతవకలలో 16మందిని దోషులుగా గుర్తించారు. అయితే ఆ 16మంది ఎవరో, వారి పేర్లు ఏమిటో బయట పెట్టాలని టిటిడి బోర్డు మాజీ సభ్యుడు భానుప్రకాష్ ఇటీవల జిల్లా యస్.పి.ని కూడా కలిసి ఫిర్యాదు చేశాడు. అవసరమైతే సిబిసిఐడి చేత ఎంక్వయిరీ చేయించాలని కూడా ఆయన డిమాండ్ చేశాడు. తిరుమల ఆధ్యాత్మిక కేంద్రమా లేక దళారీల నిలయమా అని కూడా భాను ప్రశ్నించాడు.

తమది పారదర్శక ప్రభుత్వం, నిజాయితీ ప్రభుత్వం, ఎవ్వరికీ భయపడని ప్రభుత్వం అంటూ ఎప్పుడూ ఎదుటవారిని వేలెత్తి చూపించే చంద్రబాబు ఈ అధికారి విషయంలో మాత్రం ఎందుకు తోక ముడిచాడో ఆయనకే తెలియాలి. ఎవరికైనా వ్యక్తిగత మొహమాటాలు వుంటాయి, ఉద్యోగ పరిమితులూ ఉంటాయి. హోదాకి తగ్గట్లుగా గౌరవమూ ఉంటుంది. కాని, వీటన్నింటినీ హక్కుగా వాడుకుంటూ తిరుమల అంటే తానే, "శ్రీనివాసుడు" అంటే తానే అన్నట్లుగా వ్యవహరిస్తే ప్రభుత్వాలు, పాలకులు మౌనం వహిస్తారేమో తప్ప, ఆ దేవదేవుడు మాత్రం క్షమించడు. ఓం నమో వేంకటేశాయ నమః!

## కాలధర్మం

### పోలంరెడ్డి నాగభూషణమ్మ



ఈదూరు గ్రామసర్పంచ్‌గా రెండు దశాబ్దాలపాటు నిబద్ధతతో పనిచేసి, క్రమశిక్షణకు మారుపేరుగా ఉంటూ గ్రామాభ్యున్నతికి ఎంతగానో కృషిచేసిన స్వర్గీయ పోలంరెడ్డి ఈశ్వరరెడ్డి సతీమణి శ్రీమతి పోలంరెడ్డి నాగభూషణమ్మ ఈనెల 19వ తేది రాత్రి స్వర్గస్తురాలయ్యారు. ఆమెకు 93 ఏళ్ళు. వీరికి ముగ్గురు కుమారులు. పోలంరెడ్డి రఘునాథరెడ్డి, వేణుగోపాలరెడ్డి, కృష్ణప్రసాద్‌రెడ్డి.. వీరంతా ప్రస్తుతం చెన్నైలోనే స్థిరపడ్డారు.

ఒకప్పట్లో 'ఈదూరు ఈశ్వరరెడ్డి' గారంటే ఒక్క ఈదూరులోనే కాక, చుట్టుపక్కల ఊళ్ళల్లో కూడా మంచి ప్రఖ్యాతి ఉండేది. ఇంటిపేరు పోలంరెడ్డే అయినా ఈదూరు ఈశ్వరరెడ్డిగానే ఆయనకు ప్రజల్లో మంచిపేరు ఉండేది. 1960 ప్రాంతం నుంచి దాదాపు 20 ఏళ్ళపాటు ఈదూరు గ్రామపెద్దగా, సర్పంచ్‌గా ఉంటూ ఊరిప్రజలకు ఎనలేని సేవలు చేశారాయన. ఆసుపత్రి, పశువైద్యశాల, కమ్యూనిటీహాల్, గ్రంథాలయం అన్నీ ఆ ఊరికి ఆయన హయాంలోనే వచ్చాయి. తొలిసారిగా గ్రామానికి విద్యుత్ సౌకర్యం కూడా వచ్చింది ఆయన సర్పంచ్‌గా ఉన్నప్పుడే. 1976 ప్రాంతంలో చెన్నైకి వచ్చి స్టోన్ క్రషింగ్ వ్యాపారంలోకి దిగినా, ఊళ్ళో ఉన్నవారికి కూడా ఎంతో ప్రోత్సాహాన్నిచ్చి వారిని కూడా మంచి వ్యాపారస్తులుగా తీర్చిదిద్దిన ఘనత ఈశ్వరరెడ్డిదే. కాగా, సొంత బిడ్డలమైన తమనే కాక, తమ పిన్నమ్మ బిడ్డలైన కోడూరు మధుసూదన్‌రెడ్డి, కోడూరు రామ్మోహన్‌రెడ్డిలను కూడా ఎంతో ప్రేమాభిమానాలతో తమ తండ్రి పెంచి పెద్దచేశాడని ఈ సందర్భంగా తమ తల్లిదండ్రుల సహృదయతను వారి కుమారుడైన పోలంరెడ్డి వేణుగోపాలరెడ్డి తెలియజేశారు. ఈనెల 31న చెన్నైలోని నందనం, లోటస్ కాలనీ ఉన్న తమ నివాసంలో తమ తల్లి ఉత్తరక్రియలు జరుగు తాయని ఆయన పేర్కొన్నారు. నాగభూషణమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### దూది రాఘవయ్య



రిటైర్డ్ ఎం.డి.ఓ దూది రాఘవయ్య తన 85వ ఏట ఈ నెల 9వ తేదీన మరణించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. నెల్లూరురూరల్ ఎంపిడిఓ వసుమతి ఆయన కూతురవుతారు. సత్యసాయి విద్యాసంస్థల అధినేత చామకూరు హరగోపాల్‌కు ఆయన మామగారవుతారు. కొడవలూరు మండలం దంపూరు ఆయన స్వగ్రామం. కష్టంతో పైకొచ్చిన మనిషి. పదిమంది మంచిచెడ్డలు చూసేవాడు. తన కుటుంబసభ్యులకు ఉన్నత విలువలు నేర్పి ఉన్నతమైన మార్గంలో నడిపించారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.




ఈ నెల 24వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన 11వ గ్లోబల్ అగ్రికల్చరల్ లీడర్‌షిప్ సమ్మిట్ అండ్ లీడర్‌షిప్ అవార్డు 2018 ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా నవ్యాంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తరపున 'పాలసీ లీడర్‌షిప్' అవార్డును అందుకుంటున్న రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

# సేవామూర్తికి సేవాభిషేకం

- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి 'సేవాభూషణ్' బిరుదు
- నెల్లూరు పురమందిరం వేదికగా నవంబర్ 1న సేవాసారధులకు సత్కారం





ప్రముఖ దాత, మహోన్నత సేవామూర్తి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ఎంతో విశిష్టమైన 'సేవాభూషణ్' బిరుదును ప్రదానం చేయనున్నారు. భారతీయ సినిమా గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ఆయన ఈ ప్రతిష్టాత్మకమైన బిరుదును అందుకోనున్నారు. నెల్లూరు పురమందిరంలో నవంబర్ 1వ తేది సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఈ బిరుదు ప్రదానం జరుగనుంది. మానవీయ హృదయంతో అటు సమాజానికి, ఇటు ఆధ్యాత్మిక ప్రపంచానికి ఆయన చేస్తున్న బృహత్తరమైన సేవలకు గుర్తింపుగా ఈ బిరుదును ప్రదానం చేయనున్నారు. నెల్లూరులోని కళాంజలి సాంస్కృతిక సంస్థ రజతోత్సవ వేడుకల్లో జరిగే ఈ కార్యక్రమంలో పలువురు సమాజ సేవామూర్తులకు సత్కారాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో పాటు, నెల్లూరు ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మురళీకృష్ణ70 ఎం.డి వీరిశెట్టి హజరత్‌బాబు, 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని కళాంజలి అనంత్ తెలియజేశారు. ఈ సందర్భంగా 'పాడుతా తీయగా' గాయనీ గాయకులచే 'స్వరఝరి' కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## ఆ గట్టునుంటావా నాగన్న..
# ఈ గట్టునుంటావా...?

- మొదలైన రాజకీయ జంపింగ్‌లు

ఎన్నికలు సమీపిస్తున్నాయి. రాజకీయ పార్టీలు జంపింగ్ జిలానీల కోసం ఎదురు చూస్తున్నాయి. 'టీడీపీలో చేరిన వైసిపి కార్యకర్తలు'... అలాగే 'వైసిపిలోకి టీడీపీ నాయకులు'... ఇక ప్రతిరోజూ మీడియాలో మనకు కనిపించబోయే హెడ్‌లైన్స్ ఇవి. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కూడా ప్రతిరోజూ పార్టీ జంపింగ్‌లు వుంటున్నాయి. సర్వేపల్లి నియోజకవర్గంలో అయితే ఈ చేరికలు విచిత్రంగా వుంటున్నాయి. కొన్ని కుటుంబాలు ఉదయం ఒక నాయకుడి సమక్షంలో ఒక పార్టీలో చేరతారు, సాయంత్రం అవే కుటుంబాలు ఇంకో నాయకుడి సమక్షంలో ఇంకో పార్టీలో చేరుతాయి.

ఇటీవల బోగోలు జడ్పీటీసీ బాపట్ల కామేశ్వరి, వైసిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాపట్ల వెంకటరఘుపతి, వైసిపి జిల్లా స్టీరింగ్ కమిటి సభ్యులు చిలకపాటి వెంకటేశ్వర్లు మంత్రి నారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్రల సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. వీళ్ళ చేరికకే ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ నాయకులు పెద్దసీన్ క్రియేట్ చేశారు.

కాగా, ఈ నెల 22వ తేదీన నెల్లూరులోని వైసిపి జిల్లా కార్యాలయంలో నెల్లూరు నగరంలోని 18, 19, 20, 36డివిజన్‌లకు చెందిన పెనాక రామకృష్ణారెడ్డి, పెళ్ళకూరు సుధాకర్‌రెడ్డి, కొండేటి రఘురామిరెడ్డి, ఎంబేటి ఏసునాయుడులు 500మంది కార్యకర్తలతో వైసిపిలో చేరారు. వీళ్ళ చేరికకు పార్టీ ఆఫీసులో పెద్ద బిల్డప్ ఇచ్చారు. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డిలు హాజరయ్యారు.

పార్టీల జంపింగ్‌లు ఇప్పుడే మొదలయ్యాయి. ఎన్నికలు దగ్గరయ్యే కొద్దీ ఇవి ఊపందుకునే అవకాశాలున్నాయి.

# తెరపైకి మహిళా శక్తులు

## • అమ్మల ఆశీస్సుల కోసం అభ్యర్థుల తపన





నెల్లూరుజిల్లా రాజకీయ చరిత్రను పరిశీలిస్తే మనకు మహిళల నుండి ఇద్దరే ఇద్దరు శాసనసభ్యులుగా కనిపిస్తారు. ఒకరు మాగుంట పార్వతమ్మ, ఇంకొకరు నేదురుమల్లి రాజ్యలక్ష్మి. 1996లో ఒంగోలు పార్లమెంట్ సభ్యురాలుగా గెలిచిన మాగుంట పార్వతమ్మ, 2004 ఎన్నికల్లో కావలి నుండి శాసనసభ్యురాలిగా గెలిచి ఐదేళ్ళ పాటు ఆ నియోజక వర్గ ప్రజలకు సేవలందించింది. ఇక నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ 1999, 2004, 2009 ఎన్నికల్లో వరుసగా వెంకటగిరి అసెంబ్లీ నుండి పోటీ చేసి రెండుసార్లు గెలుపొందడమే కాక 2004 నుండి 2009 వరకు వై.యస్. కేబినెట్‌లో మంత్రిగా కూడా పని చేసింది. ఈ రెండు నియోజక వర్గాలలో వారిద్దరికీ ఇప్పటికే పేరుంది. కావలి రాజకీయాలకు పార్వతమ్మ దూరమై పదేళ్ళు కావస్తోంది. అయినా ప్రజలు ఆమెను మరచిపోలేదు. ప్రజలపై ఆమె ప్రభావం తగ్గలేదు. ప్రజలలో ఆమెకు అంతటి పేరుంది కాబట్టే కావలి నుండి పోటీ చేయాలని భావిస్తున్న నాయకులు ఆమె ఆశీస్సులు కోరుకుంటున్నారు. కావలి నుండి మరోసారి పోటీ చేయాలని భావిస్తున్న సిటింగ్ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఇటీవల ఆమెను కలిసి ఆశీస్సులందుకున్నాడు. అలాగే కావలి వైసిపి టిక్కెట్‌ను ఆశిస్తున్న మాజీఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సైతం ఆమె దీవెనలందుకోవడం జరిగింది. ఉదయగిరి నుండి టీడీపీ టిక్కెట్ రేస్‌లో వున్న పారిశ్రామికవేత్త కావ్య కృష్ణారెడ్డి కూడా పార్వతమ్మను కలిసి ఆమె మద్దతు కోరారు.

వెంకటగిరి రాజకీయాలకు నేదురుమల్లి రాజ్యలక్ష్మి కూడా పదేళ్ళ నుండి దూరంగా వుంటున్నారు. వెంకటగిరి రాజకీయాలను ఆమె కుమారుడు రామ్‌కుమార్‌రెడ్డే చూస్తున్నాడు. అయినా ఈ అసెంబ్లీకి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన రాజ్యలక్ష్మమ్మ ప్రాధాన్యత తగ్గలేదు. ప్రజల్లో ఆమె పరపతి, పలుకుబడి అలానే వుంది. వెంకటగిరి వైసిపి అభ్యర్థిగా ప్రచారంలో వున్న ఆనం రామనారాయణరెడ్డి తాను సొంత అక్కలా అభిమానించే రాజ్యలక్ష్మమ్మను కలిసి ఆమె మద్దతు కోరాలనుకుంటున్నాడు. ఇలా పదేళ్ళ క్రితం రాజకీయ తెర నుండి మాయమైన ఇద్దరూ మహిళా శక్తులు మళ్ళీ ఒక్కసారిగా తెర మీద కనిపించడం విశేషం.!

## నాయుడుపేటకు 'పుర' హోదా!

నగర పంచాయితీగా వున్న నాయుడుపేటకు గ్రేడ్-3 మున్సిపాలిటీ హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిం తీసుకుంది. మున్సిపల్ మంత్రిగా నారాయణ తీసుకున్న చొరవతో నాయుడుపేటకు హోదా పెరిగింది. మున్సిపాల్టీలకు వచ్చే నిధులు ఇక నాయుడుపేటకు కూడా రానున్నాయి. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆనం రామనారాయణరెడ్డి మున్సిపల్ మంత్రిగా వున్నప్పుడే సూళ్లూరుపేట, ఆత్మకూరులను మున్సిపాల్టీలుగా, నాయుడుపేటను నగర పంచాయితీగా మార్చేందుకు ఫైల్ కదిలించాడు. ఆయన ఆర్థిక మంత్రయ్యాక అవి కార్యరూపం దాల్చాయి. జిల్లాలో ఒక పెద్ద కూడలి నాయుడుపేట... మున్సిపాల్టీ హోదా ఇవ్వడం కరెక్టే!

# వాళ్ళిద్దరినీ పట్టండి!

## • కొమ్మి, బొమ్మిరెడ్డిలకు 'దేశం' వల





ఆత్మకూరు నియోజకవర్గంలో కీలకమైన నాయకులు మాజీఎమెమల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డిలు. ప్రస్తుతానికి వీళ్ళిద్దరూ పొలిటికల్ విఆర్‌లో వున్నారు. అంటే గతంలో వున్న పార్టీని వదిలేసారు. ఇంకా ఏ పార్టీలో చేరలేదు. ఇద్దరి రాజకీయ నేపథ్యం ఆత్మకూరుతో ముడిపడివున్నప్పటికీ ఇద్దరి రాజకీయ జీవితాలలో కీలక మలుపుకు వెంకటగిరి నియోజకవర్గం కారణం కావడం ఇక్కడ గమనించాల్సిన విషయం.

2014 ఎన్నికల్లో వెంకటగిరి నుండి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన కొమ్మి లక్ష్మయ్య నాయుడు పరాజయం పాలయ్యాడు. ఓడిపోయిన తర్వాత ఆయన వెంకటగిరి వైపు చూడలేదు. పార్టీని పట్టించుకోలేదు. పార్టీ కూడా ఆయనను అలాగే వదిలేసింది. అప్పటినుండి ఆయన విఆర్‌లోనే వున్నాడు.

వెంకటగిరిని కొమ్మి వదిలేసిన తర్వాత జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డికి తగిలించారు. వెంకటగిరి వైసిపి ఇన్‌ఛార్జ్‌గా రాఘవ ఈ నాలుగేళ్లు బాగానే కష్టపడ్డాడు. వెంకటగిరి సీటు తనకే వస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకుని వున్నాడు. అయితే ఆనం రామనారాయణ రెడ్డి వైసిపిలో చేరడంతో లెక్కలు తారుమారయ్యాయి. ఆత్మకూరుకు పోతాడనుకున్న ఆనం రామనారాయణరెడ్డిని వెంకటగిరి ఇన్‌ఛార్జ్‌గా పంపారు. దీంతో ఒళ్ళు మండిన రాఘవ తనకు ఇక వెంకటగిరి సీటు ఇవ్వరనుకుని వైసిపికి రాజీనామా చేశాడు.


అలా వెంకటగిరి బంధంతో విఆర్‌లో వున్న కొమ్మి, బొమ్మిరెడ్డిలను తెలుగుదేశంలోకి ఆహ్వానించాలని మొన్న తనను కలిసిన నెల్లూరు టీడీపీ నాయకులు మంత్రి నారాయణ, పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బొల్లినేని కృష్ణయ్యలకు చంద్రబాబు సూచించారు. వీరిద్దరితో తెలుగుదేశం నాయకులు ఇంతకుముందే సంప్రదింపులు జరిపివున్నారు. కొమ్మి ఎలాగూ తెలుగుదేశంలోనే చేరతాడు. ఇక వైసిపిని వదిలి రావడం, అది కూడా జగన్ మీదే బండలేయడంతో బొమ్మిరెడ్డికి కూడా ఇక తెలుగుదేశమే ప్రత్యామ్నాయ రాజకీయ మార్గమవుతుంది. టీడీపీలో వీళ్ళిద్దరి చేరికకు ఇక బాబు మాట్లాడి హామీలివ్వడమే మిగిలివుంది.

## కారుణ్యం చూపారు



నియామకపత్రాన్నందజేస్తున్న మెట్టుకూరు

రాపూరు సహకార బ్యాంకులో స్టాఫ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్‌ఖాసిం కొంత కాలం క్రితం మృతిచెందారు. ఈ నేపథ్యంలో బ్యాంకు పాలకవర్గం ఖాసిం భార్య బీబీజాన్‌కు బ్యాంకులో కారుణ్య నియామకం క్రింద ఉద్యోగమిచ్చింది. ఈ నెల 23వ తేదీన నెల్లూరులోని డీసీసీబి కార్యాలయంలో బ్యాంక్ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఆమెకు ఉద్యోగ నియామక పత్రాన్ని అందించారు. బ్యాంకు వైస్‌ఛైర్మెన్ నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, సిఇఓ కె.వి. రమణారెడ్డి, బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బంది ఈ కార్య క్రమంలో పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

# ఆరని 'అయ్యప్ప జ్వాల'




సుప్రీం కోర్టేమో తాంబూలాలిచ్చాం తన్నుకు చావండి అన్నట్లుగా శబరిమలై దేవస్థానంలోకి మహిళల ప్రవేశంపై అనుకూలంగా తీర్పు ఇచ్చేసింది. కోర్టు తీర్పును అవకాశంగా తీసుకుని కొందరు హిందూ ఆచారాలపైనే దాడి చేయడానికి ప్రయత్నిస్తుండగా, హిందువులు దానిని తిప్పికొట్టే రీతిలో ఉద్యమానికి దిగడంతో కేరళలో పెద్దఎత్తున ఉద్రిక్తత చోటుచేసుకుంది. శబరిమలై ఇంత వివాదం కావడానికి ప్రథమ కారణం కేరళలో సీపీఎం ప్రభుత్వం ఉండడమే!

శబరిమలై అయ్యప్ప సన్నిధిలోకి మహిళలను అనుమతించాలంటూ స్త్రీవాదులు వేసిన పిటిషన్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోయింది. సన్నిధిలోకి మహిళలను అనుమతించాలంటూ సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. దేవుడి ముందు అందరూ సమానమే అన్నప్పుడు గుడుల్లోకి స్త్రీలను ప్రవేశించకుండా కోర్టు అడ్డు చెప్పలేదుగా! న్యాయస్థానాలు మనం వ్రాసుకున్న రాజ్యాంగం ప్రకారం నడుస్తాయేగాని మన పూర్వీకులు వ్రాసిన మతగ్రంథాలు, ఆచార వ్యవహారాలనుబట్టి కాదు కదా!

ఇక్కడ సుప్రీం కోర్టు తీర్పును ఆక్షేపించలేం. అలాగని అన్ని మతాల విషయంలో సుప్రీం కోర్టు ఇలాగే జోక్యం చేసుకుని తీర్పునివ్వగలదా అని హిందూత్వవాదులు వినిపిస్తున్న ప్రశ్నలకు కూడా న్యాయస్థానాలు సమాధానాలు చెప్పాల్సివుంది.

అయితే న్యాయస్థానాలు తీర్పునివ్వగానే అవి అమలులోకి వస్తాయనుకోవడం కూడా పొరపాటే! సుప్రీం తీర్పులను తుంగలో తొక్కిన సంఘటనలు చాలానే వున్నాయి. ఒక ఆచారం, ఒక సంప్రదాయం మానవ సమాజానికి హాని కలిగించనివై వున్నప్పుడు దానిని ఆచరించడంలో అభ్యంతరపెట్టాల్సింది ఏమీ లేదు. శబరిమలైలో 15 నుండి 50ఏళ్ళలోపు మహిళలపై నిషేధం ఇలాంటిదే! 15ఏళ్ళలోపు, లేదా 50ఏళ్లపైబడిన మహిళలు అయ్యప్పస్వామిని దర్శించుకోవడంపై ఎలాంటి ఆక్షేపణ లేదు. కేవలం బహిష్టు వయసు వారికి మాత్రమే ప్రవేశం లేదు. అంతమాత్రాన అది వివక్షతో కూడుకున్నదని ముద్ర వేయడం తగదు. ఎందుకంటే ఇతర ఏ హిందూ ఆలయంలో కూడా లింగవివక్ష లేదు. ఒక్క శబరిమలైలో తప్పితే ఇంకే అయ్యప్ప ఆలయంలోనూ మహిళా భక్తులపై నిషేధం లేదు. ఏ మత సంస్కృతిలోనైనా సమాజానికి చెడు కలిగించే దురాచారాలను రూపుమాపాల్సిందే! అంటరానితనం, బాల్య వివాహాలు, సతీ సహగమనం, తాంత్రిక పూజలు, బలులు... ఇలాంటి మూఢత్వాలను తరిమికొట్టాలి. కాని, వీటితో పోలిస్తే శబరిమలైలో కొనసాగుతున్న ఆచారం ఎవరికీ ఇబ్బంది కలిగించేది కాదు. సమాజానికి చెడు చేసేదీ కాదు. అంతెందుకు నిఖార్సుగా హిందూ సంస్కృతి సంప్రదాయాలను పాటించే మహిళా భక్తులు... శబరిమలై సన్నిధిలోకి ప్రవేశం కల్పించాలని గట్టిగా పట్టుబడితే ఈ సుప్రీం కోర్టు తీర్పులు, ఉద్యమాలు అవసరం కూడా లేదు. మహిళల కోసం శబరిమలై అయ్యప్ప సన్నిధి తలుపులు ఎప్పుడో తెరుచుకుని వుండేవి. అయ్యప్పను కొలిచే హిందూ స్త్రీలు ఎవరు కూడా ఆచారాలను మంటగలిపి శబరిమలైకు వెళ్లాలనుకోవడం లేదు. శబరిమలై సన్నిధి సంప్రదాయాన్ని హిందూ మహిళలు గౌరవిస్తున్నారు. తమ భర్తలకు, బిడ్డలకు ఇరుముడులు కట్టి సంతోషంగా అయ్యప్ప స్వామి దర్శనానికి సాగనంపుతున్నారు. మరి హిందూ స్త్రీలలో ఈ డిమాండ్ లేనప్పుడు శబరిమలై కేంద్రంగా ఇంత రచ్చ జరగడానికి కారణమెవరు? దీనికి సమాధానం అతివాదస్త్రీలు కొందరు. శబరిమలైపై కోర్టుకెక్కింది హేతువాద మహిళే! సుప్రీం కోర్టు తీర్పును అవకాశంగా తీసుకుని శబరిమలై సన్నిధిలోకి పోలీసుల సాయంతో బలవంతంగా ప్రవేశించాలనుకున్నది కూడా వామపక్ష భావాలున్న ఇద్దరు మహిళలే! వీళ్ళిద్దరూ స్త్రీ స్వేచ్ఛావాదులు. వీళ్ళు కట్టుకున్న ఇరుముడులలోనూ స్త్రీలు వాడేసిన శానిటరీ నాప్‌కిన్స్ వున్నాయనే సమాచారం ఆందోళన కలిగించేదే! అయ్యప్ప సన్నిధిలోకి వెళ్లాక బహిష్టు గుడ్డలను సన్నిధిలో విసిరేయాలని ప్లాన్ చేసారని, అయ్యప్ప భక్తులు బలంగా వారిని అడ్డుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని సమాచారం. ఎందుకంటే వాళ్లు అదే పని చేసుంటే మతపరమైన అల్లర్లకు ఆస్కారమిచ్చినట్లుండేది.

సుప్రీం కోర్టేమో తాంబూలాలిచ్చాం తన్నుకు చావండి అన్నట్లుగా తీర్పు ఇచ్చేసింది. కోర్టు తీర్పును అవకాశంగా తీసుకుని కొందరు హిందూ ఆచారాలపైనే దాడి చేయడానికి ప్రయత్నిస్తుండగా, హిందువులు దానిని తిప్పికొట్టే రీతిలో ఉద్యమానికి దిగడంతో కేరళలో పెద్దఎత్తున ఉద్రిక్తత చోటుచేసుకుంది. శబరిమలై ఇంత వివాదం కావడానికి ప్రథమ కారణం కేరళలో సీపీఎం ప్రభుత్వం ఉండడమే! శబరిమలై ఇంకే ఇతర రాష్ట్రంలో వుండి వున్నా సుప్రీం తీర్పు కంటే కూడా మెజార్టీ ప్రజల మనోభావాలకే ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతనిచ్చి, ఈ తీర్పును మేము అమలు చేయలేమంటూ చేతులెత్తేసి వుండేవి. కాని కేరళలో వున్నది వామపక్ష ప్రభుత్వం. మత ఆచారాలకు, అందులోనూ హిందూ మత సంస్కృతికి పూర్తి విరుద్ధంగా వ్యవహరించే ప్రభుత్వం. కాబట్టే సుప్రీం కోర్టు తీర్పును మేము అమలు చేస్తామంటూ ఘనంగా ప్రకటించారు. దీనిని అయ్యప్ప భక్తులు వ్యతిరేకించారు. సుప్రీం కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా లక్షలాది మంది భక్తులు రోడ్లమీదకొచ్చి ఉద్యమించారు. 'సేవ్ శబరిమల' అంటూ అయ్యప్ప సన్నిధికి బలవంతంగా పోవాలనుకున్న వారిని అడ్డుకున్నారు.

ఏ పార్టీ అయినా ఏ ప్రభుత్వమైనా ఇక్కడ గమనించాల్సింది ఒక్కటే! ఈ దేశాన్ని 400 ఏళ్ళు పాలించిన మొఘలులు, 200 ఏళ్ళు పాలించిన బ్రిటీషోళ్ళే ఈ దేశ మూల సంస్కృతిని ఏమీ చేయలేకపోయారు. అంతే కాదు, వాళ్ళు కూడా చివరకు ఇక్కడి ఆచారాలు, సంప్రదాయాలను గౌరవించారు. 600ఏళ్ళ పరాయి సంస్కృతి పాలనలో గడిపాక కూడా ఈ దేశం మెజార్టీ హిందూ సంస్కృతి దేశంగా నిలవగలిగిందంటే అది ఈ సంస్కృతిలోని గొప్పదనమే! ఎందుకంటే వంద, రెండొందల ఏళ్ళ పాలనకే ఎన్నో దేశాలు పూర్తిగా మతాంతరీకరణ జరిగాయి. కాని ఎన్నో సాంస్కృతిక దాడులను ఎదుర్కొని కూడా ఈ దేశం భారత దేశంగానే నిలబడగలిగింది. ఈ దేశంలోని ప్రభుత్వాలు, పార్టీలైనా మనుగడ సాగించాలంటే ఆ సంప్రదాయాలను గౌరవించాల్సిందే! అలాకాదని విద్వేషభావంతో ముందుకుపోతే మొన్న పశ్చిమ బెంగాల్, నిన్న త్రిపురలో అధికారం కోల్పోయినట్లు రేపు కేరళలో కూడా కమ్యూనిష్టులు ఉనికిని కోల్పోతారు. ఒకప్పుడు హిందూ వ్యతిరేక భావజాలంతో వున్న కాంగ్రెస్‌వాళ్ళు సైతం ఇప్పుడు నుదుటున నామాలు పెట్టుకు తిరుగుతున్నారు. రాముడు లేడు, రామసేతు అభూతకల్పన అన్నవాళ్ళు ఇప్పుడు కనిపించిన ఆలయానికల్లా వెళుతున్నారు. అర్జంట్‌గా అయ్యప్పస్వామిని దర్శనం చేసుకోకపోవడం వల్ల హైందవ మహిళలకు వచ్చే నష్టం, కష్టం ఏమీ లేదు. వారి కోసం ప్రభుత్వాలు, పార్టీలు చేయాల్సిన పనులెన్నో వున్నాయి. చట్టసభలలో 33శాతం రిజర్వేషన్ల బిల్లు అలాగే వుంది. భ్రూణహత్యలను పూర్తి స్థాయిలో అరికట్టాలి. లైంగిక వేధింపులు, వరకట్న చావులకు కత్తెర వేయాలి. ఆడబిడ్డలను ఆర్థిక శక్తులుగా, ఆదిపరాశక్తులుగా తీర్చిదిద్దాలి. మహిళలు దేవతలుగా పూజలందుకునే ఈ పుణ్యభూమిలో ఇంకో గుడిలో దర్శనం కోసం వాళ్ళు అడుక్కునే పరిస్థితి వద్దనే వద్దు. వాళ్ళు శబరిమలై సన్నిధిలోకి ప్రవేశించాలని బలంగా సంకల్పించిన రోజు వారిని అడ్డుకునే శక్తి ఆ అయ్యప్పకు కూడా వుండదు.

### రామాయణం..

## మానవాళికి ఆదర్శం

**- ప్రవచకులు మండే లక్ష్మీనరసింహారావు**

శ్రీరామ కథ.. ఒక సామాజిక చైతన్యమని, రామాయణం సకల మానవాళికి ఆదర్శమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు మండే లక్ష్మీనరసింహారావు అన్నారు. నెల్లూరు పురమందిరంలో ఆయన ఈనెల 23న 'శ్రీరామ వైభవం'పై ప్రవచిస్తూ, వాల్మీకి రామాయణం మానవులకు మార్గదర్శకమని, మన భారతీయ సంస్కృతి సంప్రదాయాలతో పాటు, మానవ మనుగడ, వ్యక్తిత్వ వికాసం అన్నీ అందులో ఇమిడివున్నాయన్నారు. రామాయణంతో జాతి మనుగడ ముడిపడి ఉందని, శ్రీరామచంద్రుడు సకల సద్గుణ శోభితుడని, అందరికీ ఆదర్శప్రాయుడన్నారు. రాజ్యపాలన ఎలా ఉండాలి, ఉత్తమ నడవడిక ఎలా సాగాలి అన్న విషయాలన్నీ రామాయణంలో ఉన్నాయన్నారు. అనంతరం లక్ష్మీనరసింహారావును నగర ప్రముఖులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుమలశెట్టి చంద్ర, రాంజీ, సునీల్, రమేష్ పాల్గొన్నారు.

### బాలుని వైద్యానికి..

## పినాకిని సింహాల సాయం

నెల్లూరులోని లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని వారు ఓ బాలుని వైద్యఖర్చులకు 82వేల రూపాయలను సాయంగా అందజేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. కోవూరు సాలుచింతల గ్రామానికి చెందిన శేఖర్‌బాబు–ఉషారాణిల తనయుడైన స్టీఫెన్ వైద్యఖర్చుల కోసం ఈనెల 22న జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని అధ్యక్షుడు టివి కిషోర్‌కుమార్, కుటుంబసభ్యులు కలసి 35వేలు, సభ్యులు 47 వేలు అందజేశారు. చంద్రశేఖర్, పార్థసారథి, మోహన్, హేమలత, అంజూషా, నీలేష్ పాల్గొన్నారు.

## మెగా జాబ్‌మేళా

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఈనెల 28న నెల్లూరులో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని కస్తూరిదేవి స్కూల్ ప్రాంగణంలో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంలో ఆరోజు ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి కలవారు తమ పేర్లను 'జాబ్‌స్కిల్స్ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్' వైబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ చేసినవారు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## స్థాయిసంఘ సమావేశం

నెల్లూరు పొదలకూరురోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అధ్యక్షతన ఈనెల 30వ తేది స్థాయి సంఘాల సమావేశం నిర్వహించనున్నారు. జడ్పీ సీఇఒ సీహెచ్ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో ఆర్థిక, జిల్లా గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య–వైద్యం, స్త్రీ, శిశు సంక్షేమం తదితర స్థాయిసంఘాల సమావేశాలు జరుగుతాయి.




## వర్షాలు కురిపించు బాబూ!

మొన్నటిదాకా ప్రపంచాన్నే కంట్రోల్ చేస్తున్నానని చంద్రబాబు చెప్పుకు తిరిగేవాడు. ఇప్పుడు ప్రకృతిని కూడా హ్యాండిల్ చేస్తున్నానని చెప్పుకుంటున్నాడు. అరచేయి అడ్డుపెట్టి తుఫాన్‌లను అడ్డుకుంటున్నానంటున్నాడు. మా నెల్లూరు జిల్లాలో ఎండలు మిడిమేళంగా కాస్తున్నాయి. ఎండాకాలం మాదిరిగానే ఉక్కపోత ఉంది. చంద్రబాబు అరచేతిని అడ్డం పెట్టి సూర్యుడిని ఆపితే మా నెల్లూరు జనాలు ఎండల నుండి ఉపశమనం పొందుతారు. అలాగే వరుణదేవుడిని మేనేజ్ చేసి వర్షాలు కురిపించాలి. వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటిపోయి మా నెల్లూరు జనాలు నీళ్ళకు అల్లాడుతున్నారు. ప్రకృతిని హ్యాండిల్ చేసే బాబుగారు తన నైపుణ్యంతో నెల్లూరు జిల్లాలో వర్షాలు కురిపిస్తే వచ్చే ఎన్నికల్లో మా జిల్లా వాళ్ళ ఓట్లన్నీ ఆయనకే!

సి. పెంచలయ్య, ఆదూరుపల్లి.

## విశ్వాసాలను గౌరవించండి

కత్తికి లేని దురద కందకు ఎందుకన్నట్లుగా వుంది శబరిమలై విషయంలో కొందరు మహిళావాదాలు చేస్తున్న అతి. హిందూ ఆచార వ్యవహారాలతో కూడిన సున్నితమైన సమస్య ఇది. శబరిమలై అయ్యప్పస్వామి ఆలయంలోకి మహిళలు వెళ్లొచ్చని సుప్రీం కోర్టు తీర్పునివ్వడం వరకు కరెక్టే! కాని శబరిమల ఆచారాలను గౌరవించే హిందూ మహిళలెవరూ అయ్యప్ప ఆలయంలోకి వెళ్లాలనుకోవడం లేదు. హిందూ ఆచారవ్యవహారాలపై వ్యతిరేకత కలిగివుండే కొందరు స్త్రీ అతివాదులు మాత్రమే బలవంతంగా ఆలయంలోకి వెళ్లాలని చూస్తూ హిందువుల మనోభావాలతో చెలగాటమాడుతున్నారు. దేశ వ్యాప్తంగా హిందువులు ఏకతాటిపై నిలిస్తేనే ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు దారికొస్తాయి.

– సి.రాజీవి, నెల్లూరు.

## వ్యవస్థలు ఏం చేస్తున్నాయి?

పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో రావణ దహనం సందర్భంగా రైలు క్రింద పడి అంతమంది చనిపోవడం అన్నది ఎవరి నిర్లక్ష్యం? అసలు పట్టాలమీద అన్ని వేలమంది వుంటే రైళ్ల రాకపోకలకు సిగ్నల్ ఎలా ఇస్తారు? పోలీసులకు, రైల్వేవాళ్ళకు ఆ మాత్రం తెలియదా? ఇది పూర్తిగా ప్రభుత్వ శాఖల వైఫల్యమే!

– పి.సంజు, నెల్లూరు.

■ నెల్లూరు పార్లమెంటు

# మళ్లీ మేకపాటే అయితే..
# ఆదాలకు జాక్‌పాటే..!

## ఏ నోట విన్నా ఇదే మాట

**రాజకీయాలలో ఎత్తులకు పైఎత్తులు ఉంటాయి. వ్యూహాలకు ప్రతివ్యూహాలు ఉంటాయి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో వ్యూహాత్మకంగా తీసుకునే నిర్ణయాలు, వేసే అడుగులే విజయాన్ని తెచ్చి మన ముందర పెడుతుంటాయి. ఇలాంటి వ్యూహాత్మక రచనే నెల్లూరుజిల్లా తెలుగుదేశం పార్టీలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేస్తున్నాడని చెప్పవచ్చు.**



నెల్లూరుజిల్లా తెలుగుదేశం పార్టీలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈరోజు ఒక కీలకమైన నాయకుడిగా మారిపోయాడు. ఎంతలా మారిపోయాడంటే... వచ్చే ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలో తెలుగుదేశం టిక్కెట్లు ఎవరికీ ఖరారు చేయలేదు. కుప్పం సీటు నుండి నేనే పోటీ చేస్తానని అభ్యర్థులను ఖరారు చేసే చంద్రబాబే ఇంతవరకూ చెప్పుకోలేదు. కొన్ని నెలల క్రితం కర్నూలులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్,

**❑ టి.డి.పి ముందడుగు వేస్తోంది**

**❑ వై.సి.పి సస్పెన్స్‌తో నడుస్తోంది**

కర్నూలు అసెంబ్లీకి పోటీ చేస్తాడని ఒక పేరు చెబితే, వెంటనే ఎంపి టి.జి.వెంకటేష్... కర్నూలు అసెంబ్లీ అభ్యర్థిని డిసైడ్ చేయ డానికి లోకేష్ ఎవరు? అంటూ తీవ్ర స్వరంతో మండిపడ్డాడు. టీడీపీలో అభ్యర్థిని ప్రకటించడం అంటూ జరిగితే అది చంద్రబాబు ద్వారానే జరగాలి. అలాంటిది నెల్లూరుజిల్లాలో మాత్రం నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిని నేనే, ఆత్మకూరు అసెంబ్లీ అభ్యర్థి బొల్లినేని కృష్ణయ్యే అని ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్వయంగా ప్రకటించేసాడు. ఆ తర్వాత పార్టీలో ఎవరూ దానిని ఖండించలేదు. అంటే పార్టీలో ఆదాల ప్రాధాన్యత ఏ స్థాయిలో పెరిగిందో దీనిని బట్టే అర్థం చేసుకోవచ్చు.

### ఆదాల ధైర్యం అతడే...

రాష్ట్రంలోనే వైసిపి బలంగా వున్న జిల్లాల్లో నెల్లూరు అగ్రస్థానంలో వుంది. అలాంటి జిల్లాలో నెల్లూరు లోక్‌సభ నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేయ డానికి ఆయన సిద్ధపడుతున్నాడు. అంటే ఆయన ధైర్యం ఏంటి? ఈ ప్రశ్నకు సమాధానమే మేకపాటి రాజమోహన్‌రెడ్డి. నిజమే... ఆయన వెనుకున్న ధైర్యం మేకపాటి! వైసిపి ఎంపీ అభ్యర్థి మేకపాటి అయితే తాను గెలుస్తానన్న నమ్మకమే ఆదాలను నెల్లూరు లోక్‌సభ పోటీ వైపు పరుగులు తీయిస్తోంది.

### టీమ్ సెట్ అయినట్లే..

వైసిపి ఎంపీ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డి అయితే ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్లాన్ ఈ విధంగా వుండబోతుంది. నెల్లూరు నగరం నుండి మంత్రి పి.నారాయణ, నెల్లూరురూరల్ నుండి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్, పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డిలలో ఒకరు. కోవూరు నుండి పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కావలి నుండి బీద మస్తాన్‌రావు, కందుకూరు నుండి పోతుల రామారావు, ఉదయగిరి నుండి ఏదో ఒక డబ్బులు పెట్టుకునే రెడ్డి అభ్యర్థి, ఆత్మకూరు నుండి బొల్లినేని కృష్ణయ్య... ఇదీ అభ్యర్థుల ప్లాన్. ఏ అభ్యర్థికీ ఆదాల డబ్బు సర్దనవసరం లేదు. ఏదన్నా వుంటే అధిష్టానం చూసుకుంటుంది. ఈ టీమ్‌తో ఎలక్షన్‌కు పోతే ఏడు అసెంబ్లీలలో నాలుగు అసెంబ్లీలలో టీడీపీ ఎమ్మెల్యేలు గెలిస్తే ఎంపీ అభ్యర్థిగా ఆదాల గెలుపు నల్లేరు మీద నడకే! ఒకవేళ మూడు స్థానాలలో టీడీపీ అభ్యర్థులు గెలిచినా కూడా తనకే గెలుపు అవకాశాలుంటాయన్నది ఆదాల నమ్మకం. ఆయన నమ్ముకునే అంశాలను చూద్దాం... సిటింగ్ ఎంపీగా మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై ప్రజల్లో వ్యతిరేకతవుంది. ఇప్పటికి మూడుసార్లు ఆయనను గెలిపించారు. ఈసారికి ఎంపీగా ఆదాలకు ఓటేద్దాం అనే ఆలోచన కొందరిలో రావచ్చు. కాబట్టి ఆయన నెగిటివ్ ఓటు తనకు కలిసి రావొచ్చనేది ఆదాల అంచనా!

### క్రాస్ ఓటింగ్ విశ్వాసం..

నెల్లూరురూరల్ నియోజకవర్గంలో సిటింగ్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి తిరుగులేదు. అక్కడ పోటీ చేయడానికే టీడీపీ నాయకులు సాహసించడం లేదు. అయితే శ్రీధర్‌రెడ్డి అంత కాకున్నా ఈ నాలుగున్నరేళ్ల నుండి రూరల్ టీడీపీ ఇన్‌ఛార్జ్‌గా ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా ఈ నియోజకవర్గంలో తిరుగుతున్నాడు. పలు పనులు చేసాడు. నగర పరిధిలోని డివిజన్ నాయకులతోనూ, గ్రామాలలోని నాయకులతోనూ పార్టీలకతీతంగా సత్సంబంధాలు కలిగివున్నాడు. అసెంబ్లీకి పోటీ చేసి శ్రీధర్‌రెడ్డికి కాకుండా నాకు ఓటేయమంటే ఆయన ప్లాన్ సక్సెస్ కాదేమోగాని, ఎంపీ అభ్యర్థిగా రూరల్ ప్రజల ముందుకు వెళ్లి పార్లమెంట్ ఓటు వరకు మాత్రం తనకు వేయమని కోరితే ఆదాల సక్సెస్ కావచ్చు. రూరల్‌లో భారీగా క్రాస్ ఓటింగ్ జరగొచ్చు. ఎందుకంటే ప్రస్తుతం రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తర్వాత ప్రజలతో టచ్‌లో వున్న నాయకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డే! 2014 ఎన్నికల్లో ఇక్కడ భారీగానే క్రాస్ ఓటింగ్ జరిగింది. కాబట్టి నాయకుల వారీగా ఓట్లు వేయడంలో రూరల్ ఓటర్లకు ప్రత్యేక ట్రైనింగ్ ఇవ్వాల్సిన అవసరం కూడాలేదు. నెల్లూరు నగరంలో మంత్రి నారాయణ పోటీ చేస్తే గట్టిపోటీ నెలకొంటుంది. అసెంబ్లీ ఫలితం ఎలావున్నా తనకున్న వ్యక్తిగత సంబంధాల దృష్ట్యా పార్లమెంటులో కొద్దోగొప్పో తనకే ఆధిపత్యం వస్తుందని ఆదాల అంచనా! కోవూరు, కావలిలలో ఆదాల వ్యక్తిగత ప్రాబల్యం వుంటుంది కాబట్టి ఈ రెండు చోట్ల క్రాస్ ఓటింగ్ పెరిగి తనకు మెజార్టీ పెరుగుతుందని ఆయన ధీమా. కందుకూరు, ఉదయగిరిలలో లోక్‌సభకు, అసెంబ్లీ మెజార్టీలకు పెద్ద తేడా రాకపోవచ్చు. 2014 ఎన్నికలలో ఆత్మకూరులో వచ్చిన మెజార్టీ వల్లే మేకపాటి రాజమోహన్‌రెడ్డి గెలిచాడు. కాని ఈసారి అక్కడ గౌతమ్‌కు అంత సీన్ లేదు. బొల్లినేని కృష్ణయ్య గట్టి పోటీ ఇస్తాడని నమ్ముతున్నాడు. ఎవరు గెలిచినా ఎంపీకైనా, అసెంబ్లీకైనా పెద్ద తేడా వుండదన్నది ఆదాల నమ్మకం.

ఆదాల దృష్టిలో ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలలో వైసిపికి భారీ మెజార్టీలు రాకుంటే చాలు. తాను గెలుస్తాననే నమ్మకం వుంది. అది కూడా మేకపాటి రాజమోహన్‌రెడ్డి వైసిపి ఎంపీ అభ్యర్థి అయ్యి, ఆత్మకూరు నుండి ఆనం రామనారాయణరెడ్డి పోటీ చేయకుంటేనే..!

### ఎటూ తేల్చని వై.సి.పి

ఎవరి వ్యూహాగానాల్లో వారున్నప్పటికీ వై.సి.పి వ్యూహం మాత్రం సస్పెన్స్‌లో నడుస్తోంది. అసలు ఆదాలకే వీరు గాలం వేస్తారా..? లేక మాగుంట శీనయ్యను నెల్లూరుకు పోటీ చేయిస్తారా అనే మీమాంస నడుస్తోంది. మరోవైపు రాజమోహన్‌రెడ్డితో పాటు చంద్రశేఖర్‌రెడ్డిని కూడా మార్చాలనే డిమాండ్ బలంగా తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో మేకపాటి కుటుంబంలో ముగ్గురికీ సీటిస్తారా లేక ఇద్దరితో సరిపెట్టి స్థానాలు మారుస్తారా అన్నది తెలవలసి వుంది. ఆదాలను టైట్ చేయాలంటే యంపి అభ్యర్థిని ఖచ్చితంగా మార్చి ఆత్మకూరు నుండి ఆనంను, వెంకటగిరి నుండి రాంకుమార్‌ను, ఉదయగిరి నుండి గౌతంను బరిలోకి దింపితే టిడిపి ఆశలు అడియాశలైపోతాయి. ఒకవేళ మాగుంట శీనయ్య పార్టీ మారే ఆలోచనలో లేకపోతే మరో బలమైన కొత్త అభ్యర్థిని కూడా బరిలోదించే ఆలోచనలో వైసిపి వున్నట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా నెల్లూరు పార్ల మెంటు అభ్యర్థిపైనే మిగిలిన అసెంబ్లీల భవిష్యత్తు ఆధారపడి వుందన్నది కాదనలేని వాస్తవం.

---

● నారాయణను పైకెత్తిన సోమిరెడ్డి

# ఏందబ్బా ఇది...



నారాయణను పొగుడుతున్న సోమిరెడ్డి

ఎవరి దారి వారిదే అన్నట్లుగా వుండే జిల్లా మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణలు ఇద్దరూ కలిసి ఒకే కార్యక్రమాన్ని పర్యవేక్షించడం ఆశ్చర్యం గొలిపే విషయమే. ఈ నెల 21వ తేదీన మంత్రులిద్దరూ కలిసి అల్లీపురం సమీపంలోని మంగలదిబ్బ వద్ద 800 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 'హౌస్ ఫర్ ఆల్' గృహ సముదాయాలను పరిశీలించారు. అల్లీపురం వాసులకు కొత్తగా ఇళ్ళు వస్తున్నాయంటూ సోమిరెడ్డి సంబరం వ్యక్తం చేసారు. అంతేకాదు, విదేశాలకే పరిమితమైన అధునాతన షేర్‌వాల్ టెక్నాలజీతో పేదలకు ఇళ్ళు కట్టిస్తూ మంత్రి నారాయణ చరిత్ర సృష్టిస్తున్నారని కూడా సోమిరెడ్డి పొగిడారు. తన నోటితో సోమిరెడ్డి మంత్రి నారాయణను పొగిడాడంటే వెనుక ఏదో మతలబు వుంది.!



# నెల్లూరు కబుర్లు

## అర్బన్ వైపు మరో అడుగు

నెల్లూరు అర్బన్ మండలం తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటు విషయంలో ఇంకో అడుగు పడింది. అర్బన్ తహశీల్దార్ కార్యాలయానికి పోస్టులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు అర్బన్ తహశీల్దార్ కార్యాలయానికి మొత్తం పది పోస్టులు మంజూరు చేశారు. ఒక తహశీల్దార్, ఒక డిప్యూటీ తహశీల్దార్‌తో పాటు మిగతా పోస్టులు కేటాయించారు. ఇందులో ఆర్ఐలు, విఆర్ఓలు, సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు, సర్వేయర్‌లు వుంటారు.

8లక్షల దాకా జనాభా వున్న నెల్లూరు నగరానికి ఒక్క తహశీల్దార్ కార్యాలయం మాత్రమే వుంది. దీంతో సిబ్బందికి పని భారం పెరిగింది. ప్రజలకు కూడా పనులు ఆలస్యం కాసాగాయి. ఒక్క పని కోసం వారాలు కాదు నెలలు తరబడి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం గత ఏడాది నెల్లూరుకు మరో తహశీల్దార్ కార్యాలయాన్ని మంజూరు చేసింది. ఇప్పుడు పోస్టులు కూడా మంజూరు చేయడంతో ఈ ప్రక్రియ వేగవంతమైంది. అర్బన్ తహశీల్దార్ కార్యాలయం ఎక్కడ పెడతారో ఇక తేల్చాల్సివుంది.

### అమ్మవారి సన్నిధిలో

## అన్నదానానికి సీఎంఆర్ విరాళం



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నూతనంగా అమలు చేయనున్న అన్నదానం కోసం సీఎంఆర్ షాపింగ్ మాల్ అధినేత మావూరి శ్రీనివాసరావు 2లక్షల 150రూపాయలను విరాళంగా అందజేశారు. దసరా రోజున ఆయన ఈ విరాళాన్ని ఆలయ ఇ.ఓ వెండిదండి శ్రీనివాసరెడ్డికి అందజేశారు. భక్తుల విరాళాలపై వచ్చే వడ్డీతో అమ్మవారి సన్నిధిలో ప్రతి శుక్రవారం భక్తులకు అన్నదానం చేయనున్నారు.

## బస్టాండ్‌లు కిటకిట

ఈ నెల 21వ తేదీతో దసరా సెలవులు ముగిసాయి. 22వ తేదీ యధావిధిగా బళ్ళు తెరచుకున్నాయి. పన్నెండు రోజులు పాటు విశ్రాంతి తీసుకున్న స్కూల్ బస్సులు రోడ్లపైకి వచ్చాయి. ఇక దసరా ఎఫెక్ట్ చూడాలంటే 21వ తేదీ రాత్రి నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లో చూసుండాలి. ఆరోజు రాత్రి బస్టాండ్‌లో అయితే తిరునాల వాతావరణమే నెలకొంది. బస్టాండ్ ఆవరణం ప్రయాణీకులతో కిక్కిరిసిపోయింది. అన్ని ప్లాట్‌ఫారాల మీద హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, విజయవాడలకు వెళ్ళే స్పెషల్ బస్సులే! వోల్వో, సూపర్‌లగ్జరీ, డీలక్స్ బస్సులు చాలక ఆఖరుకు దగ్గర ఊర్లకు తిరిగే ఎక్స్‌ప్రెస్‌లను కూడా బెంగుళూరు, హైదరాబాద్ నగరాలకు స్పెషల్ బస్సులుగా తిప్పారు. ఆర్టీసీ వాళ్ళే దాదాపు వంద దాకా అదనపు బస్సులు నడిపారు. ఇక ప్రైవేట్ ట్రావెల్స్ అయితే ఆ నగరాల వైపు నుండి వచ్చే బస్సులను నెల్లూరు వైపు నుండే పెట్టారు. దసరా ధమాకా అన్నట్లు ఛార్జీలను కూడా మూడింతలు చేశారు.

### రెయిన్‌బో పిల్లోడు...

## సత్తా చూపాడు



జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు నెల్లూరు రూరల్‌లోని కలివెలపాళెం గ్రామంలో ఉన్న రెయిన్‌బో సిబిఎస్ఇ విద్యార్థి పివియన్ నిఖిల్ రామ్ ఎంపికయ్యాడు. ఈనెల 9 నుంచి 12వ తేది వరకు ముంబైలో జరిగి సిబిఎస్ఇ సౌత్‌జోన్ అండర్-10 పోటీల్లో రింక్ రేస్-2లో కేవలం 35.26 సెకన్లలో లక్ష్యాన్ని సాధించి గోల్డ్‌మెడల్ సాధించి, జాతీయస్థాయి పోటీలకు అర్హత సంపాదించాడు. త్వరలో చత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్‌లో జరుగనున్న జాతీయస్థాయి స్కేటింగ్‌పోటీల్లో నిఖిల్‌రామ్ పాల్గొననున్నట్లు పాఠశాల డైరెక్టర్ శ్రీమతి పద్మాసుబ్రహ్మణ్యం తెలిపారు. నిఖిల్‌రామ్‌ను, స్కేటింగ్‌మాస్టర్ భరత్‌ను ఆమె ఈ సందర్భంగా అభినందించారు.

### 'గోషా'

## కావాలన్న మేయర్



ఈ నెల 22వ తేదీన నెల్లూరు పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి పూనం మాలకొండయ్యను నగర మేయర్ అబ్దుల్ అజీజ్ కలిసారు. నెల్లూరులో మహిళల కోసం ప్రత్యేకంగా ఆసుపత్రి(గోషా) ఏర్పాటు చేయాలని ఆమెను కోరారు. అందుకు నగరపాలక సంస్థ తరపున తమవంతు సహకారమందిస్తామని కూడా హామీ ఇచ్చారు. ఆసుపత్రిలో మహిళావైద్యులను, నర్సులను ఏర్పాటు చేసి ఉచితంగా మహిళలకు వైద్యసేవలందించాలని అడిగారు.

### ఓబిసి యువమోర్చా

## రాష్ట్ర కార్యదర్శిగా ముక్కు



భారతీయ జనతా పార్టీ ఓబిసి యువమోర్చ రాష్ట్ర కార్యదర్శిగా నెల్లూరుకు చెందిన ముక్కు రాధాకృష్ణను నియమించారు. రాధాకృష్ణ నిబద్ధతగల బీజేపీ కార్యకర్త. ఏబివిపిలోను, ఆ తర్వాత బిజెవైఎంలోనూ పలు పదవులు నిర్వహించారు. ఆరెస్సెస్ ప్రథమ వర్ష శిక్షణ పూర్తి చేశారు. తనకు ఈ పదవి రావడానికి కారణమైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ, ఓబిసి మోర్చ రాష్ట్ర అధ్యక్షులు జగ్గారపు రామ్మోహన్‌రావుకు, బీజేపీ నాయకులు కె.కోటేశ్వరరావు, సన్నపరెడ్డి సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, పి.సురేంద్రరెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## రాజేశ్వరమ్మకు రాబడి పెరిగింది



దసరా శరన్నవ రాత్రోత్సవాల సందర్భంగా నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంకు 56,15,788 రూపాయల ఆదాయం వచ్చింది. 20వతేదీ ఆలయంలో హుండీలను లెక్కించారు. హుండీలో కానుకల ద్వారా 20,65,455 రూపాయలు రాగా, వివిధ దర్శనం, పూజా టిక్కెట్ల అమ్మకాల ద్వారా 35,50,333 రూపాయల ఆదాయం వచ్చింది. గతేడాదికన్నా 5,84,536రూపాయలు అదనంగా ఆదాయం వచ్చింది.

### 4వ నగర(దర్గామిట్ట) పోలీసులు

## కొత్త భవనంలోకి మారారు

నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లో వున్న దర్గామిట్ట పోలీసుస్టేషన్(నాలుగో నగరం)ను పొదలకూరు రోడ్డులో కొత్తగా నిర్మించిన భవనంలోకి పూర్తిగా మార్చేసారు. ఈ నెల 4వ తేదీన హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, డిజిపి ఆర్‌పిఠాకూర్‌లు ఈ భవనాన్ని ప్రారంభించారు. అయితే పాత భవనంలో వున్న రికార్డులను, కంప్యూటర్‌లను స్టేషనరీని కొత్త భవనంలోకి మార్చి సెట్ చేయడానికి ఇన్నిరోజులు పట్టింది. ఇక ఈ స్టేషన్ పరిధిలోని బాధితులు పాత పోలీస్‌స్టేషన్ భవనం వద్దకు పోనవసరంలేదు. పొదలకూరురోడ్డు కార్పొరేషన్ కార్యాలయం వద్ద వున్న కొత్త భవనానికి పోవాల్సివుంటుంది. ఇంతకాలం ఈ పోలీస్‌స్టేషన్ వుండడం వల్ల విఆర్‌సి సెంటర్ రచ్చరావిడిగా వుండేది. ఇప్పుడు ఆ సందడి తగ్గినట్లే!

## శ్రద్ధాంజలి



మా తల్లిగారైన

**శ్రీమతి పోలంరెడ్డి నాగభూషణమ్మ గారు**

తేది 19.10.2018 శుక్రవారం రాత్రి స్వర్గస్తులైనారు. వారి ఆత్మకు శాంతిని కలుగచేయమని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

కీ.శే॥ పోలంరెడ్డి నాగభూషణమ్మ గారు
(స్వర్గీయ పోలంరెడ్డి ఈశ్వరరెడ్డి గారి ధర్మపత్ని)
ఈదూరు గ్రామం, నెల్లూరుజిల్లా.

కుమారుడు
పోలంరెడ్డి వేణుగోపాలరెడ్డి
MD., Hotel Nirmala Dakshin, Chennai.
మరియు కుటుంబ సభ్యులు
ఫోన్: 94457 64545

**ఉత్తరక్రియలు:** తేది 31-10-2018 బుధవారం లోటస్ కాలనీ, నందనం, చెన్నైలోని మా స్వగృహము నందు జరుగును.

**సహపంక్తి, సంస్మరణ:** విజయరాఘవరోడ్, టి.నగర్, చెన్నై, ASCA (ఆంధ్రక్లబ్) నందు ఉదయం 11-00 గం॥లకు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

### అంతర్జాతీయ అవార్డునందుకున్న

## డాక్టర్ బిందుమీనన్




నెల్లూరులోని అపోలో ఆసుపత్రికి చెందిన న్యూరాలజీ విభాగం అధిపతి, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్‌కు అంతర్జాతీయస్థాయి గుర్తింపు లభించింది. వైద్యరంగంలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుడుతూ న్యూరాలజీలో తనదైన సేవలందిస్తున్న డాక్టర్ బిందుమీనన్‌కు వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ వార్నర్‌హ్యాకి నుంచి ఆమె ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇండివీడ్యువల్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. ఈ నెల 18న కెనడాలోని మాంట్రియల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఈ విశిష్టమైన అవార్డును బహుకరించారు. ఈ కార్యక్రమంలో 91 దేశాలకు చెందిన 2600మంది ప్రతినిధులు హాజరయ్యారు. పక్షవాతంతో బాధపడుతున్నవారికి చికిత్స అందించడంలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన వారికి ఇచ్చే ఈ అవార్డును ఈసారి మనదేశానికి చెందిన డాక్టర్ బిందుమీనన్‌కు బహుకరించడం విశేషం. ఈ అవార్డు రావడం, తాను సమర్పించిన మూడు పరిశోధక పత్రాలు ఎంపిక కావడం తనకెంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా డాక్టర్ బిందుమీనన్ పేర్కొన్నారు.

## వేమారెడ్డికి ప్రశంసాపత్రం

తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాలలో చక్కటి విధుల నిర్వహణకు గాను నెల్లూరు నార్త్ ట్రాఫిక్ సి.ఐ కె.వేమారెడ్డి ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ నెల 10 నుండి తిరుమలలో జరిగిన బ్రహ్మోత్సవాలలో వేమారెడ్డి సమర్థవంతంగా విధులు నిర్వహించారు. దీనికిగాను 20వ తేదీన తిరుపతి అర్బన్ ఎస్పీ అభిషేక్ మహంతి నుండి ఆయన జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకున్నారు.

# 'దిశా' నిర్దేశకుడిగా విపిఆర్



ఇటీవలే కేంద్ర హోం పార్లమెంటరీ కమిటి సభ్యుడిగా పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని నియమించిన కేంద్ర ప్రభుత్వం మరో కీలకమైన బాధ్యతను కూడా ఆయనకు అప్ప గించింది. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాకు సంబంధించి డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేషన్ అండ్ మెయింటెనింగ్ కమిటి(డిఐఎస్‌హెచ్‌ఎ) ఛైర్మన్‌గా నియమిస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ మరియు గనులశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 'దిశ' కమిటీ ఛైర్మెన్‌గా జిల్లాలో కేంద్రప్రభుత్వ పథకాలు ఏ విధంగా అమలు జరుగుతున్నాయన్నది ఆయన పర్యవేక్షిస్తారు. పథకాలలో లోటుపాట్లు గురించి కేంద్రానికి తెలియజేస్తారు. జిల్లాలో దాదాపు 40కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలవుతున్నాయని, వాటిని ప్రతి ఒక్క అర్హునికి అందేలా చేస్తానని ఈ సందర్భంగా ఎంపి విపిఆర్ పేర్కొన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన నరేంద్రసింగ్ తోమార్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## • రోడ్డేమో అరకొర...

# అప్పుడే లేపారు.. వసూళ్ళకు తెర!

**రోడ్డు బాగా వేసారని ఆనందించే లోపే తోలు వూడేలా వసూలు చేస్తున్న టోల్‌గేటు ఫీజులు ఆ ఆనందాన్ని ఆవిరిచేస్తున్నాయి. రోడ్లు బాగుపడ్డందుకు ఆనందించాలో, రోడ్డు రూపంలో అదనపు భారం పడుతున్నందుకు ఏడవాలో అర్థంకాని పరిస్థితులు నెలకొంటున్నాయి.**




నెల్లూరు - హుబ్లీ మధ్య ముంబై జాతీయ రహదారిని కొత్తగా వేయడం తెలిసిందే! నెల్లూరు నుండి బద్వేల్ వరకు మూడులైన్లుగా మార్చారు. నెల్లూరు నుండి నెల్లూరుపాలెం వరకు సిమెంట్‌రోడ్డు వేశారు. రోడ్డును కొంచెం వెడల్పు చేసా రన్నమాటేగాని దీనివల్ల పెద్దగా ఉప యోగం లేదు. సిమెంట్‌రోడ్డు కావడంతో దీనిపై వెళ్లేటప్పుడు వాహనాలు అదురు తున్నాయి. సిమెంట్ రోడ్డుపై పట్టులేక సడెన్ బ్రేక్‌లు వేసినప్పుడు వాహనాలు అదుపుతప్పి పల్టీలు కొడుతున్నాయి. ఈ సిమెంట్‌రోడ్డు ఖర్చుతో నెల్లూరు నుండి నెల్లూరుపాలెం వరకు శుభ్రంగా నాలుగులైన్ల తారురోడ్డు వేసి వుండొచ్చు. ఈ రహదారిలో బుచ్చి ఊర్లో నుండి మొదట ఫ్లైవర్ నిర్మించాలనుకున్నారు. అయితే స్థానికులు అభ్యంతరం చెప్పడంతో బుచ్చికి బైపాస్ వేయాలని నిర్ణయించారు. అయితే ఆ బైపాస్‌కు ఇంతవరకు భూ సేకరణ జరగలేదు. ప్రస్తుతానికి బుచ్చి ఊర్లో నుండే రాకపోకలు సాగుతున్నాయి. నెల్లూరు - బద్వేల్ మధ్య అక్కడక్కడ పనులు పూర్తి చేయాల్సివుంది. అయినా ఈలోపే బుచ్చి, మర్రిపాడుల వద్ద టోల్ గేట్లు తెరిచారు. వాహనదారుల నుండి టోల్‌ఫీజులు బాదడం మొదలుపెట్టారు. ముఖ్యంగా నెల్లూరు-ఆత్మకూరు, నెల్లూరు-పామూరు, నెల్లూరు-కడప, నెల్లూరు-కర్నూలు, నెల్లూరు-అనంతపురం ప్రాంతాలవైపు ఎక్కువ సంఖ్యలో బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. టోల్‌గేట్లు తెరవడంతో ఈ ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ప్రయాణం చేసే వారిపై ఒక్కసారిగా భారం మోపారు. ఆర్టీసీ వాళ్ళు టోల్‌ఛార్జీ లను ప్రయాణీకుల నుండే వసూలు చేస్తుం డడంతో ఆయా ఊర్లకు బస్సు ఛార్జీలు వున్నట్లుండి పెరిగాయి.

## • అమాత్యుల నివాళి

# అమరవీరులూ అమర్‌రహే

### అక్టోబర్ 21న అమరవీరుల సంస్మరణ



నివాళులర్పిస్తున్న మంత్రి సోమిరెడ్డి, మేయర్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, పోలీసు అధికారులు

దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో, సమాజంలోని అంతర్గత శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలను బలిదానం చేసిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొనియాడారు. అమర వీరుల ఆశయసాధనకు అందరం కలిసి కట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఈనెల 21 న నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో అమరవీరుల స్థూపం వద్ద అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తన ప్రసం గంలో పోలీసుల పట్ల తనకున్న గౌరవ భావాన్ని చాటుకున్నారు. పోలీసుల గురించి ఆయన మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో జవాన్లు యుద్ధం వచ్చినప్పుడే పోరాటం చేస్తారని, పోలీసులు సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు నిత్యం పోరాడుతూనే ఉంటారన్నారు. పోలీసు విధి నిర్వహణ కత్తిమీద సామేనన్నారు. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడంతో పాటు అసాంఘిక శక్తుల ఆటలు కట్టించి, సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు పోలీసులు నిరంతరం శ్రమిస్తూనే ఉంటారన్నారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకో లేమన్నారు. విధి నిర్వహణలో తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన పోలీసుల త్యాగనిరతి అందరికి స్ఫూర్తి దాయకమన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం నెల్లూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏఎస్పీలు పరమేశ్వరరెడ్డి, వీరభద్రుడు, డీఎస్పీలు, ఎన్ కోటారెడ్డి, ఎన్‌బీఎం మురళీక కృష్ణ, వీయస్ రాంబాబు, రామాంజనేయులు, కె. శ్రీనివాసాచారి, పి.శ్రీధర్, మల్లిఖార్జున, హోంగార్డు డీఎస్పీ శ్రీనివాసులు, నెల్లూరు నగర, రూరల్ సీఐలు, ఎస్సైలు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, రాష్ట్ర నాయకులు ఎం.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

# ముువ్వా మొండోడబ్బా..!



తాడిని తన్నేవాడొకడైతే, వాడి తలను తన్నేవాడు ఇంకొకడంట... నెల్లూరుజిల్లా కలెక్టర్ ముత్యాలరాజే చాలా మొండి మనిషి. ఏ విషయంలోనూ రాజీపడడు. అలాంటి మొండి కలెక్టర్‌కే మింగుడుపడకుండా తయారయ్యాడు గత జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం.

నెల్లూరులో డిఇఓగా, బిఇడి కాలేజ్ ప్రిన్సిపాల్‌గా వున్న అతనిని అనేక ఆరోపణల నేపథ్యంలో కొన్ని నెలల క్రితం ప్రభుత్వానికి సరెండర్ చేయడం జరిగింది. అయితే మంత్రి స్థాయిలో వున్న పరపతితో పల్లిపాడు డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పోస్టింగ్ తెచ్చుకున్నాడు. అయితే అతనిని సర్వీసులోకి తీసుకోవడానికి కలెక్టర్ నిరాకరించాడు. ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్‌గా వెంకటేశ్వర్లును నియమించారు. అయితే దీనిని మువ్వా ఖాతరు చేయలేదు. కాలేజీలోకి వెళ్లి ప్రిన్సిపాల్ సీట్లో అతనిని కూర్చోనీయకుండా ఆక్రమించుకున్నాడు. డైట్ ప్రిన్సిపాల్‌గా తనను ఎవరూ తొలగించలేరని తొడకొట్టి చెప్పాడు. అనుకున్నట్లే రెండురోజుల్లో ప్రభుత్వం నుండి మువ్వానే డైట్ ప్రిన్సిపాల్‌గా కొనసాగనివ్వాలని ఆర్డర్స్ వచ్చాయి. చంద్ర బాబు ప్రభుత్వంలో ఇలాంటి వాళ్ళ హవానే ఎక్కువుగా నడుస్తోంది.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


## నెల్లూరులో కూడా...

# అభ్యంతరం చెప్తున్న అయ్యప్పస్వాములు




'సేవ్ శబరిమలై' ర్యాలీలో పాల్గొన్న నాయకులు

శబరిమలై అయ్యప్పస్వామి ఆలయంలోకి మహిళలను అనుమతిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా కేరళలో హిందువులు పెద్దఎత్తున ఉద్యమం చేస్తున్నారు. ప్రతి ఏటా ఈ సీజన్‌లో నెల్లూరులో పెద్దసంఖ్యలోనే అయ్యప్ప భక్తులు మాలలు ధరిస్తుంటారు. అయితే అక్కడ అంతెత్తున ఉద్యమం జరుగుతున్నా ఇక్కడ ఎవరూ నోరు విప్పలేదు. దీనిపై సోషల్ మీడియాలో విమర్శలు రావడంతో ఎట్టకేలకు శ్రీ స్వామి అయ్యప్ప సేవా సమాజం కమిటి స్పందించింది. ఈ నెల 22వ తేదీన నెల్లూరులో అయ్యప్పస్వాములు, అయ్యప్ప భక్తులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు లోని అంబేద్కర్ విగ్రహం నుండి గాంధీబొమ్మ వరకు 'సేవ్ శబరిమలై' అంటూ సాగిన ర్యాలీలో అన్ని పక్షాల నాయకులు భారీసంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొనడం విశేషం. ప్రతియేట అయ్యప్పమాలను ధరించే నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి లతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, బీజేపీ మహిళా నాయకురాలు డాక్టర్ విజయలక్ష్మి, అయ్యప్ప సేవాసమాజం అధ్యక్షులు పి.టి. రంగరాజన్, నెల్లూరు డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, ప్రముఖ పండితులు మాచవోలు రమేష్‌శర్మ, మాచవోలు కోటేశ్వరశర్మ, వేదగిరి ఫణిశర్మ, అయ్యప్ప ఆలయం కార్యదర్శి శేషగిరిరావు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలంటూ వారు డిమాండ్ చేశారు.




# ఎన్‌బికెఆర్‌లో ప్రాంగణ ఎంపికలు



కోట మండలం, విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కి చెందిన 'ఆప్ట్రాయిడ్' సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రాంగణ ఎంపికలు చేపట్టింది. బిటెక్ చివరి సంవత్సరం చదువుతున్న ట్రిబుల్‌ఇ, సిఎస్‌ఇ విద్యార్థులకు నిర్వహించిన ఈ ఎంపికల్లో మొత్తం 102 మంది విద్యార్థులు పాల్గొనగా, అందులో 16మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నారని కళాశాల నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఇంటర్వ్యూలు కూడా నిర్వహిస్తామన్నారు. ప్రపంచవ్యాప్తంగా 40 దేశాల్లో తమ కంపెనీలో దాదాపు 6 వేలమంది పనిచేస్తున్నారని ఈ సందర్భంగా ఆప్ట్రాయిడ్ కంపెనీ ప్రతినిధి సిహెచ్‌ఆర్ అఖిలేష్ తెలిపారు. వి-శాట్ ప్రతినిధి ప్రవీణ్, ప్రాంగణ ఎంపికల అధికారి డా.ఎన్.కిషాందర్ తదితరులు పాల్గొన్నారు.

# గీతాంజలిలో 'డీప్ లెర్నింగ్'పై ప్రసంగం



గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఈ నెల 23న బీటెక్, సిఎస్‌ఇ విద్యార్థులకు 'డీప్ లెర్నింగ్', మరియు 'మెషిన్ లెర్నింగ్' అనే సాంకేతిక అంశాలపై గెస్ట్‌లెక్చర్ ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్గించారు. సిఎస్‌ఇ విభాగంలో రీసెర్చి స్కాలర్, ఐఐటి చెన్నైకి చెందిన జి.చంద్రశేఖర్ పాల్గొని విద్యార్థులకు ఆయా అంశాలు బాగా అర్థమయ్యేలా ప్రసంగించారు.

## గూడూరు డివిజన్ వార్తలు

### ఎల్‌ఏపి విద్యార్థులు

# బంగారు పతకాలు సాధించారు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

ఇటీవల హైదరాబాద్‌లో నల్లమల ఫౌండేషన్ స్కూల్ వారు నిర్వహించిన క్లస్టర్‌సెవెన్ సి.బి.ఎస్.ఇ అథ్లెటిక్ మీట్‌లో లిటిల్ ఏంజల్స్ విద్యార్థులు వి.యుగేష్‌రోషన్ బాలుర విభాగంలో, ఎల్.లోహిత బాలికల విభాగంలో లాంగ్‌జంప్ ఈవెంట్‌లో బంగారు పతకాలు సాధించారని ఆ పాఠశాల కరస్పాండెంట్లు బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. నవంబర్ 10న జరగబోయే జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌మీట్‌కి ఈ విద్యార్థులిద్దరూ అర్హతను సాధించారని వారు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల వైస్‌ఛైర్మెన్ బి.శ్రీకాంత్‌రెడ్డి, పిఇటి బి.రమేష్, ప్రధాన ఉపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయ, ఉపాధ్యాయిని బృందం వారిని అభినందించింది.



డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేషన్ అండ్ మెయింటెనింగ్ కమిటి(దిశా) ఛైర్మెన్‌గా ఎన్నికైన సందర్భంగా రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఈ నెల 22వ తేదీ నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసి సన్మానిస్తున్న గూడూరు బ్రాహ్మణ సేవాసంఘ గౌరవాధ్యక్షుడు శ్రీకంటి రామ్మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్

# ప్రజల దాహార్తి తీర్చడంలో ఎంతో సంతృప్తి

## - రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి



మంచినీటి బోరును ప్రారంభిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి

మంచినీరు అందక బాధలు పడే గ్రామీణ ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించడం, తద్వారా ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషిచేయడం తనకెంతో సంతృప్తినిచ్చే విషయమని ప్రముఖ దాత, రాజ్యసభ సభ్యులు, విపిఆర్ ఫౌండేషన్

**ప్రభాకరయ్య సేవలు ప్రక్క జిల్లాలకు కూడా విస్తరించాడు**

వ్యవస్థాపకులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. అలా అనడమే కాదు, తనవంతుగా అనేక గ్రామాల్లో విపిఆర్ అమృత ధార పేరుతో శుద్ధ జలాలను ప్రజలకు అందిస్తూ ప్రజలకు తనవంతు సేవలందిస్తున్నారు. తన సేవలను తన సొంత జిల్లా నెల్లూరుకే పరిమితం చేయకుండా, ప్రక్కజిల్లాలకు సైతం విస్తరిస్తున్నారు. నెల్లూరుజిల్లాలో దాహార్తితో విలవిలలాడుతున్న ఎన్నో గ్రామాలకు విపిఆర్ అమృత ధార పథకం ద్వారా పరిశుభ్రమైన నీటిని అందజేసిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల ప్రకాశం జిల్లాలో కూడా తమ వితరణ గుణాన్ని చాటుకున్నారు. ఆ జిల్లాలోని ఎనిమిరెడ్డిపల్లి గ్రామంలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 4 లక్షల రూపాయలతో డీప్ బోర్‌వెల్ వేయించి అక్కడి ప్రజలకు కుళాయిల ద్వారా మంచినీరు అందించి ప్రజలందరి మన్ననలు అందుకున్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ, ప్రజల దాహార్తి తీర్చగలగడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. నెల్లూరు జిల్లాలో విపిఆర్ అమృతధార కార్యక్రమం ద్వారా ఎంతోమంది ప్రజలకు శుభ్రమైన మంచినీరు అందించామన్నారు. ప్రకాశం జిల్లాలో కూడా ప్రజలకు మంచినీరు అందించేందుకు డీప్ బోర్‌వెల్ వేయించడం ఇదే ప్రథమమని అన్నారు. ఈ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈ సందర్భంగా పలు గ్రామాల ప్రజలు వేమిరెడ్డి వద్దకు వచ్చి తమ గ్రామాల్లో కూడా మంచినీటి కోసం ఎంతో కాలంగా ఎన్నో అవస్థలు పడుతున్నామని విన్నవించుకోగా, అందుకు స్పందించిన వేమిరెడ్డి ఆయా గ్రామాల్లో కూడా దశల వారీగా ఆ సమస్యలను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు.

### జగన్ సిఎం కాగానే.. ఏడాదిలో వెలిగొండ ప్రాజెక్టు - వైవి సుబ్బారెడ్డి

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపి వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ, వెలిగొండ ప్రాజెక్టు వస్తేనే ఇక్కడి ప్రకాశం జిల్లాలోని పడమటి ప్రాంతాల ప్రజలకు నీటి సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఇక్కడి ప్రజలకు మంచినీరు కానీ సాగునీరు కానీ అందాలంటే వెలిగొండ జలాలు రావాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం తాను పాదయాత్ర చేసినా ఈ మొద్దు ప్రభుత్వంలో చలనం లేదన్నారు. టిడిపి నేతలు దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. దివంగత మహానేత డా.వైఎస్ హయాంలో రాష్ట్రంలో ఎన్నో మంచినీటి ప్రాజెక్టులు వచ్చాయని గుర్తుచేశారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఏడాదిలో వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేస్తామన్నారు. స్థానిక ప్రముఖుడు పలుకూరు కోటిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో మంచినీటి సమస్య పరిష్కారానికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎంతగానో చేయూతనిస్తుండడం సంతోషకరమని కొనియాడారు.

# అమర జవాన్లకు జోహార్లు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎస్పీ రాంబాబు

దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయక శత్రువులతో పోరాడి వీరమరణం పొందిన అమరజవాన్లకు దేశ ప్రజలందరూ జోహార్లు అర్పించాలని గూడూరు డిఎస్పీ వి.యస్.రాంబాబు పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గూడూరు పట్టణంలో ఈనెల 21వ తేదీ వివిధ స్వచ్ఛంధ సంస్థలతో కలిసి పోలీసులు భారీర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిఎస్పీ మాట్లాడుతూ సమయపాలన లేకుండా రాత్రి పగలు పని చేసేది ఒక్క పోలీసే అని తెలిపారు. 1954 అక్టోబర్ 21 చైనా సరిహద్దుల్లో గడ్డకట్టే చలిలో శత్రు సైన్యంతో పోరాడి చైనా చొరబాటుదారులను తరమికొట్టి విధి నిర్వహణలో అసువులు బాసిన 10మంది వీర జవాన్లకు సంఘీభావంగా ఈ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ప్రతియేటా జరుపుకొంటామని వివరించారు. ఈ సందర్భంగా అమరులైన పోలీసులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం పురవీధుల్లో భారీ ర్యాలీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ, రూరల్ సి.ఐలు కళ్యాణ్‌రాజు, అక్కేశ్వరరావు, ఎస్సైలు శేఖర్‌బాబు, హుస్సేన్ బాషా, బాబి, శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి, భాస్కర్‌బాబు, పోలీసు సిబ్బంది, రోటరీ క్లబ్ ప్రతినిధులు, జెవివి ప్రతినిధులు పి.హరి ప్రసాద్, రాజేంద్రప్రసాద్, ఆటో సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# వృద్ధులకు చేగువేర దుప్పట్లు



పేదలకు సేవ చేయడంలో వున్న సంతృప్తి వేరే ఏ విషయంలో ఉండదని చేగువేర ఫౌండేషన్ వ్యవస్థాపకులు మండ్ల సురేష్‌బాబు తెలిపారు. గూడూరు వారి ఫౌండేషన్ కార్యాలయంలో గూడూరు వాసి అయిన సినీ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా ఈ నెల 22న వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ అనిల్‌కుమార్, ఫౌండేషన్ సభ్యులు వినోద్, అంకయ్య, వెంకటేష్, మునిదయాకర్, హరి, మాధవన్, మస్తానయ్య, సునీల్, నవీన్, శ్రీకాంతయాదవ్, ఫణి తదితరులు ఉన్నారు.

# గ్రీవెన్స్‌లో వినతుల వెల్లువ

గూడూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పలు సమస్యలను సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావిజ్ఞప్తుల దినంలో ఉప తహశీల్దార్ సారంగ పాణికి విన్నవించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు, గృహాలు, రేషన్‌కార్డులు, భూహద్దులు, కుటుంబ సభ్యుల పత్రాలు, ఇతర రెవెన్యూ పరంగా వున్న సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించి పరిష్కరించాలని మొరపెట్టుకొన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వివిధ ప్రాంతాలకు చెందిన అర్జీదారులు సమస్యలపై వినతులను అందించి పరిష్కరించాలని కోరారు. గూడూరు, చిల్లకూరు, కోట, సైదాపురం, వెంకటగిరి, బాలాయపల్లి తదితర మండలాల్లోని అర్జీదారులు తమ సమస్యలను ఏకరవుపెట్టారు. అధికారులు మాత్రం తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# చంద్రబాబుకే చెమటలు పట్టించిన చంద్రబాబు

శ్రీను గల్పిక

పాతిక ప్రపంచ మేటి నగరాలను మిక్సీలో వేసి గ్రైండ్ చేసి తీసినట్లుండే అమరావతి నగరం. ఉండవల్లిలోని తన ఇంట్లో అప్పుడే అల్పాహారం తిని తన ఆఫీసు గదిలోకి వచ్చాడు హైటెక్‌రత్న, నవ్యాంధ్ర సీఎం చంద్రబాబు. అప్పుడే ల్యాండ్ ఫోన్ మోగింది. చంద్రబాబు ఫోన్ ఎత్తి హలో నేను సీఎం చంద్రబాబుని... చెప్పండి అని అన్నాడు. అవతల నుండి నేను సిఎం రమేష్‌ను, చెప్పడానికి ఏముంది, నన్ను నిలువునా ముంచేసారుగా అని కోపంగా అన్నాడు. ఆ మాటకు చంద్రబాబు ఆశ్చర్యంగా... నేను నిన్ను ముంచడమేంటి రమేష్, నీ మీద ఐటి దాడులు జరిగితే అది నా తప్పా? అయినా కూడా నీ మీద ఐటి దాడిని రాష్ట్రం మీదనే జరిగిన దాడిగా అభివర్ణించి నీకు మద్దతుగా నిలిచాను కదా. ఇంతకంటే దిగజారి ఎవరైనా సపోర్ట్ చేయగలరా అని అడిగాడు. అందుకు సీఎం... మీరెంత సపోర్ట్ చేసారో ఇప్పుడే మీ ప్రసంగాలలో చూసాను. మిమ్మల్ని నమ్మడం నా బుద్ధి తక్కువ అంటూ విసురుగా ఫోన్ పెట్టేసాడు. సీఎం రమేష్ మాటలతో చంద్రబాబుకు షాక్ కొట్టినట్లయ్యింది. నేనేమన్నానని, అతను ఇంతగా ఎగిరిపడుతున్నాడని ఆలోచలో పడ్డాడు చంద్రబాబు. అంతలోనే ఆ గదిలోకి మంత్రులు లోకేష్, నారాయణ, దేవినేని ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పత్తిపాటి పుల్లారావు, జవహర్, ఎంపీలు మురళీమోహన్, ఎన్. శివప్రసాద్, గల్లా జయదేవ్, కేశినేని నాని తదితరులు వచ్చారు. వాళ్ళు రావడంతోనే కోపంగా వున్నారు. లోకేష్ వుండి... నిన్న నీ స్పీచ్‌తో నువ్వేంటో, నా పట్ల నీ నమ్మకమేంటో తెలిసిపోయింది డాడీ, మీరు మరీ నన్ను ఇంతలా అవమానిస్తారనుకోలేదు. మిమ్మల్ని ఇప్పటిదాకా 'బొమ్మరిల్లు' ఫాదర్ అనే అనుకున్నాను. కేరళ చర్చి ఫాదర్ అనుకోలేదు అని అన్నాడు. దేవినేని ఉమ వుండి... నాగుపాము తన పిల్లలను తానే చంపుకుతింటుందని తెలుసు. కాని మీ పార్టీని, మిమ్మల్ని నమ్ముకున్న వాళ్ళను మీరే చంపుకోవడం ఇప్పుడే చూస్తున్నాను అని ముభావంగా అన్నాడు. నారాయణ అందుకుని... మీరున్నారనే ధైర్యంతోనే మేము ఇంతకాలం రాజధాని విషయంలో ఏదేదో చేసాం... ఎన్నెన్నో దేశాలు తిరిగాం... జనానికి అరచేతిలో ఫారిన్ చూపించాం... ఈరోజు ఆ నమ్మకాన్నే వమ్ము చేసారు అని చెప్పాడు. వాళ్ళు చెబుతున్న మాటలు అర్థంగాక చంద్రబాబుకు జుట్టు పీక్కోవాలనిపించింది. అయితే క్రాఫ్ చెదిరిపోతుందని భయపడి ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. అంతలో ఆయన సెల్‌ఫోన్ మోగింది. చంద్రబాబు ఎత్తాడు. అవతల నుండి ఉండవల్లి అరుణ్‌కుమార్... చంద్రబాబు, వెరీగుడ్... నాకు జీవితంలో తొలిసారిగా నచ్చావు. ఫస్ట్‌టైం అన్నీ నిజాలు మాట్లాడావు. ఎప్పుడూ ఇలాగే ఉండయ్యా, సకాలంలో ఎండలు కాస్తాయి, వర్షాలు పడతాయి, నీలో వచ్చిన ఈ మార్పు రాష్ట్ర ప్రగతికి సంకేతం కావాలి అని చెప్పి ఫోన్ పెట్టేసాడు. చంద్రబాబు ఈసారి నిజంగానే జుట్టుపీక్కుని... అసలు ఏం జరిగింది... మీరంతా ఎందుకు నా మీద కోపంగా వున్నారు. నాకిప్పుడే తెలియాలి అని ఆవేశంగా అరిచాడు. అప్పుడు సోమిరెడ్డి... చెయ్యాల్సిందంతా చేసేసి ఇప్పుడు ఏం తెలియనట్లు మాట్లాడితే ఎలా అంటూ అక్కడే వున్న టీవీ ఆన్ చేసి టీవీ 9+9=99 న్యూస్ ఛానెల్ పెట్టాడు. టీవీ స్క్రీన్‌పై యాంకర్ సొల్లు శ్వేత ప్రత్యక్షమైంది. అప్పుడే వార్తలు మొదలయ్యాయి. "చంద్రబాబు నోటి వెంట సంచలనాలు... తెలుగుదేశం నేతల గుండెల్లో హార్ట్‌స్ట్రోక్ సంకేతాలు"... అంటూ ఫ్లాష్ న్యూస్ చదివింది. వెంటనే దానికి సంబంధించిన సన్నివేశాలు ప్రసారం కాసాగాయి.

అది శ్రీకాకుళం జిల్లాలోని మందస గ్రామం. తిత్లి తుఫాన్ బాధితుల సమావేశంలో చంద్రబాబు ప్రసంగిస్తున్నాడు.

సోదర సోదరీమణులకు హృదయపూర్వక నమస్కారాలు. తిత్లి వరద బాధితులను ఆదుకోవడంలో మా ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఈ నాలుగున్నరేళ్ళ పాలనలో మేము పూర్తిగా కలెక్షన్‌లు, ఎలక్షన్‌ల గురించే ఆలోచిస్తున్నాం. మీ బాగోగులు చూడమని మా పప్పు లోకేష్‌ను పంపించాం. వాడికి మల్లెపువ్వుకు, మొగలిపువ్వుకు తేడా తెలియదు. మీకు సహాయ చర్యలు చేపట్టడంలో మావాడు అట్టర్‌ఫ్లాప్ అయ్యాడు. ఇక మా మంత్రులుంటే తలా ఒకరకంగా బిజీ. పోలవరం, పట్టిసీమ పర్సంటేజీలు, అంచనాలు పెంచడం వంటి వాటిని చూసుకోవడానికే దేవినేని ఉమకు సరిపోతుంది. అమరావతి రాజధాని పేరుతో వేల ఎకరాల భూములు ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి నానా తంటాలు పడుతున్నాడు మా నారాయణ. మా ఎంపి సీఎం రమేష్ ఇళ్ళపై ఐటి దాడులు జరగడాన్ని స్వాగతిస్తున్నాను. నిజాయితీలో నేను నిప్పులాంటి వాణ్ణి. సీఎం రమేష్‌కు సంబంధించి అక్రమాస్తులుంటే ఆయనను వెంటనే అరెస్ట్ చేసి, ఆయన ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. మా కేబినెట్‌లో ఏ మంత్రిపై ఆరోపణలు వచ్చినా వెంటనే సిబిఐ ఎంక్వయిరీ వేసుకోవచ్చు. పోలవరం అంచనా వ్యయం పెంచడంపై కూడా వెంటనే సిట్ విచారణ జరిపించాలని కేంద్రాన్ని కోరుతున్నాను. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం ఎంతో నిజాయితీగా పని చేస్తోంది. సమర్ధవంతమైన ప్రధాని ఆయనే! రాహుల్‌గాంధీ వట్టి సుద్ధపప్పు. ఆయనకు ప్రధాని అయ్యే అర్హతలు లేవు. జగన్ మీద లక్షకోట్ల అక్రమాస్తుల ముద్రవేసింది నేనే. అప్పట్లో కాంగ్రెస్‌తో కలిసి కుట్రపన్ని జగన్‌ను కేసులలో ఇరికించడం జరిగింది. మా ప్రభుత్వంలో ప్రతి పథకంలోనూ అవినీతి చోటు చేసుకుంది. ఇంతటి అవినీతి ప్రభుత్వాన్ని మీరు ఇంతవరకు చూసుండరు. ఇలాంటి ప్రభుత్వమే మళ్ళీ మళ్ళీ కావాలంటే మాకే ఓట్లెయ్యాలి.. అని చెప్పాడు. అంతలో ఒక మహిళ లేచి... నాకు వితంతు పింఛన్ సరిగా రావడం లేదయ్యా, ఆఫీసుల చుట్టూ తిరగలేక ఛస్తున్నాను. మీకెందుకు ఓట్లెయ్యాలి అని అడిగింది. అప్పుడు చంద్ర బాబు కోపంతో నీ బోడి ఓటు వేస్తే ఎంత, వెయ్యకుంటే ఎంత, మీరు ఓట్లు వేయనంత మాత్రాన మాకు మునిగిపోయేదేమీ లేదు. ఓటుకు 20వేలు ఇచ్చి కొంటాం, ఒక్కో ఎమ్మెల్యేకి వంద కోట్లు ఖర్చుపెడతాం అని చెప్పాడు.

ఇక్కడితో టీవీలో చంద్రబాబు స్పీచ్ సీన్ అయిపోయింది. ఆ స్పీచ్ చూసి చంద్రబాబుకు మతిపోయినంతపనైంది. ఈ స్పీచ్ నేనెప్పుడు ఇచ్చానబ్బా అని ఆయన ఆలోచనలో పడ్డాడు. తర్వాత ఆయనే... ఈ స్పీచ్ ఎప్పటిది, ఎక్కడిది అని అడిగాడు. దానికి దేవినేని ఉమ... నిన్నటిదే సార్, శ్రీకాకుళం జిల్లాలోని మందసలో ప్రసంగించారు అని చెప్పాడు. అప్పుడు చంద్రబాబు తోక తొక్కిన నాగుపాములా లేచి... అసలు నేను నిన్న ఎక్కడికీ పోలేదు. దసరా పండుగ అని చెప్పి ఇంట్లోనే వుండి దేవాన్ష్‌తో ఆడుకుంటున్నాను అని చెప్పాడు. అప్పుడు లోకేష్ మెదడు పాదరసంలా పని చేసింది. సారీ, డాడీ నిన్న మీరు ఇంట్లోనే వున్న సంగతి నేను కూడా మరిచిపోయి మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను. నిన్న జరిగిందేంటనేది నామైండ్‌కు ఇప్పుడు తడుతోంది... ఇటీవల ఫేస్‌బుక్‌లో అచ్చం మీలాగే వున్న ఓ వ్యక్తి హోటల్‌లో చట్నీ సప్లయ్ చేసే సన్నివేశం వైరల్ అయ్యింది. బీజేపీవాళ్ళు అతనిని పట్టుకున్నట్లున్నారు. అతనికి మీలాగా గెటప్ వేసి, మీరు ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సమయం చూసి అతనిని జనాల్లోకి వదిలారు. ఈ విధంగా మన తప్పులను మనమే చెప్పుకుంటున్నట్లుగా ప్రజలలో సీన్ క్రియేట్ చేశారు అని చెప్పాడు. ఆ మాటతో చంద్రబాబు అలర్టై... ముందు నా డూప్‌గాణ్ణి ఎక్కడున్నా పట్టుకురండి రా... అని ఆదేశించాడు.

# మానవత్వం చాటుకున్న సాయిదర్బార్



నిరుపేదలకు దుప్పట్లు కప్పుతున్న శ్రీ సాయి దర్బార్ యువ సేవాదళ్ సభ్యులు

నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లో ఉన్న శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో జరుగుతున్న శ్రీ సాయిబాబా మహాసమాధి శతాబ్ది మహోత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక సేవలతోపాటు మానవసేవలో భాగంగా ఈనెల 21న శ్రీ సాయిదర్బార్ యువ సేవాదళ్ సభ్యులు 300 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు సాయిదర్బార్ అద్దాలమందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసూదనసాయి తెలిపారు. నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, రైల్వేస్టేషన్, రంగనాయకులపేట, చిన్నబజార్, మూలాపేట, రూరల్ ప్రాంతంలోని నరసింహకొండ ప్రాంతాల్లో రోడ్ల ప్రక్కన చలితో బాధపడుతున్న పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారన్నారు. గత 6 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సాయి భాస్వంత్, సంతోష్, దీపక్, ప్రదీప్, కృష్ణసాయి, తరుణ్, విజయ్, రాకేష్, శ్రీధర్, శ్రీకాంత్, రాజేష్‌లు పాల్గొన్నారని తెలిపారు.

# బియస్‌యన్‌యల్ దీపావళి వరాలు

దీపావళి పండుగ సందర్భంగా బీయస్‌ఎన్‌ఎల్ వినియోగదారులకు ప్రత్యేక రాయితీలు కల్పించామని బీయస్‌ఎన్‌ఎల్ పీజీఎంటీఓ ఎం.రవికుమార్ ఈనెల 22న తెలిపారు. నవంబర్ 7వతేదీ వరకు రాయితీ నజరానా అందిస్తున్నట్లు తెలిపారు. ఒక నెల పెండింగ్ బిల్ చెల్లింపుపై 1శాతం, లీజ్డ్ లైన్ బిల్లు చెల్లింపుపై 2 శాతం, 5 నెలల పెండింగ్ బిల్ చెల్లింపుపై 3శాతం రాయితీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 27వ తేదీ వరకు నిర్వహించే బీయస్‌ఎన్‌ఎల్ మేళాలో సిమ్‌ను ఉచితంగా ఇస్తున్నామన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# మహిళా ఉద్యోగులకు హాస్టల్

**- మహిళా సాధికార కేంద్రం జిల్లా మేనేజర్ బి.విజయకుమారి**

నెల్లూరు నగరంలోని మహాత్మాగాంధీనగర్‌లో మహిళా ఉద్యోగుల కోసం నూతన వసతి గృహాన్ని ప్రారంభించినట్లు మహిళా సాధికార కేంద్రం జిల్లా మేనేజర్ బి.విజయకుమారి ఈనెల 22న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా సాధికారత కేంద్రం (ఐసీడీయస్ మహిళా ప్రాంగణం), ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వసతి గృహంలో 100మంది మహిళలకు వసతి సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఒక్కొక్కరికి వసతి, భోజనానికి కలిపి నెలకు రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. హాస్టల్‌లో చేరే మహిళా ఉద్యోగులు, ఆధార్ కార్డు జెరాక్స్, ఉద్యోగ ధృవీకరణ పత్రం, ఉద్యోగ ఐడీ కార్డులతో సంప్రదించాలని కోరారు. వివరాలకు 8333921347 నంబర్లో సంప్రదించాలని కోరారు.

# రాజకీయాల్లోనూ రాణిద్దాం..

**- వైఎస్సార్సీపి ప్రాంతీయ సమన్వయకర్త డా.శశికళారెడ్డి**



మహిళలు సమాజంలో అన్ని రంగాల్లో ఎంతో ప్రతిభావంతంగా ముందుకు సాగుతున్నారని, అదేవిధంగా రాజకీయాల్లోనూ ప్రముఖ పాత్ర పోషిస్తూ రాణించాలని వైఎస్సార్సీపి కర్నూలు, నెల్లూరుజిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త డా. శశికళారెడ్డి అన్నారు. ఈనెల 23న నెల్లూరులోని వైఎస్సార్సీపి జిల్లా కార్యాలయంలో నెల్లూరుజిల్లాకు సంబంధించిన నియోజకవర్గ మహిళా సమన్వయకర్తలు, మరియు మహిళా నాయకుల సమావేశం జరిగింది. జిల్లాలోని మహిళా కమిటీలు, నాయకుల పనితీరును ఈ సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధినేత డా.వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేవరకు అందరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. జగన్ సిఎం అయితే రాష్ట్రంలోని మహిళలకు, పేదలకు, రైతులకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు అందరికీ ఉపయోగపడేలా సంక్షేమపథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. అందుకోసం వైఎస్సార్సీపి ప్రవేశపెట్టనున్న నవరత్నాల పథకాలను ప్రజలందరికీ అర్థమయ్యేలా వివరించాలని ఆమె మహిళలకు పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో వైఎస్సార్సీపి మహిళా నాయకురాళ్ళు మొయిళ్ళ గౌరి, పొట్టేళ్ళ శిరీషా, నెల్లూరు నగర మహిళా అధ్యక్షురాలు తోట శోభారాణి, ఆత్మకూరు–కోవూరు–నెల్లూరు రూరల్–ఉదయగిరి–గూడూరు నియోజకవర్గాల మహిళా కమిటీల ఇన్‌ఛార్జిలు పెయ్యల సంపూర్ణమ్మ, జడ్డా అమరావతి, చేజర్ల కవిత, బేబీ సురేఖ, ఓడూరు యమునమ్మ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి వై. లక్ష్మీకుమారి, రాష్ట్ర కార్యదర్శులు ధనుజారెడ్డి, జెస్సి పాల్గొన్నారు.


# కళ్యాణ వైభవం...!

## అద్విక్ - మణిదీపిక



కిమ్స్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు - రాజ్యశ్రీల కుమారుడు **అద్విక్ - మణిదీపిక** (మార్నేని సత్యనారాయణ - మంజరిల కుమార్తె)ల వివాహం అక్టోబర్ 20వ తేదీ హైదరాబాద్‌లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లోనూ రిసెప్షన్ 23వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లోను జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు

## హనీషా - కార్తిక్



ప్రభుత్వ న్యాయవాది కనుమూరు రఘునాథరెడ్డి - విజయలక్ష్మిల కుమార్తె **హనీషా - కార్తిక్** (అల్లూరు మండలం ఇందుపూరు వాస్తవ్యులు గునుపాటి సుధాకర్‌రెడ్డి - ఉషల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 19వ తేదీ నెల్లూరులోని కెజికె కళ్యాణ మండపం నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాకాంక్షలు.

## అశోక్ - సురేఖ



రిటైర్డ్ ఏపిఎస్ఎఫ్‌సి సీనియర్ మేనేజర్ శీలం తిరుపయ్య - డాక్టర్ యస్.అరుణకుమారిల కుమారుడు **అశోక్ - సురేఖ** (ఇందుకూరుపేట మండలం సోమరాజుపల్లి వాస్తవ్యులు నాగిరెడ్డి ఆదిశేషయ్య - లీలమ్మల కుమార్తె)ల పెళ్ళి ఈ నెల 11వ తేదీ నెల్లూరులోని పావని గార్డెన్స్ నందు జరిగింది. నవ దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.

## దివ్యశ్రీ - తరుణ్‌తేజ



హైటెక్ సర్జికల్స్ అధినేత కొటారు ఉదయభాస్కర్‌రావు - మైథిలిల కుమార్తె **దివ్యశ్రీ - తరుణ్‌తేజ** (విజయవాడ వాస్తవ్యులు బొజ్జంకుల రాధాకృష్ణ - హైమావతిల కుమారుడు)ల పరిణయం ఈ నెల 20వ తేదీ నెల్లూరులోని పివిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనలు.



# రామకృష్ణ వెళ్లాడు.. రస్తోగి వచ్చాడు



ఎట్టకేలకు నెల్లూరుజిల్లా అధికార పార్టీ నాయకుల ప్రయత్నం ఫలించింది. 16 నెలలుగా ఈ జిల్లాలో తెలుగుదేశం నాయకులకు మనశ్శాంతి లేకుండా పని చేసిన జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణను ప్రభుత్వం విజయవాడలోని స్పెషల్ ఇంటలిజన్స్ బ్యూరోకు బదిలీ చేసింది. ఆయన స్థానంలో విశాఖపట్నం రూరల్ అదనపు ఎస్పీగా వున్న ఐశ్వర్యరస్తోగిని నియమించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐశ్వర్య రస్తోగి 2013 బ్యాచ్ ఐపిఎస్ అధికారి. 2015లో ఐపిఎస్ శిక్షణ పూర్తి చేసుకున్నారు. 2016లో నర్సీపట్నం ఓఎస్‌డిగా పని చేశారు. 2017లో అనంతపురం ఏఎస్పీగా బాధ్యతలు నిర్వహించారు. ఈ ఏడాది జూన్‌లో విశాఖపట్నం రూరల్ ఏఎస్పీగా బదిలీ అయ్యారు. నాలుగు నెలలకాలంలోనే ఎస్పీగా పదోన్నతి పొంది తొలి పోస్టింగ్‌ను అధికారులకు ఎంతో ఇష్టమైన నెల్లూరుజిల్లాలో పొందారు.

### సమర్థతకు మంచి అవకాశం...

గతంలో కొత్త సినిమా రిలీజ్ అయ్యిందంటే సినీ ఇండస్ట్రీ వర్గాలు నెల్లూరు టాక్ కోసం ఎదురుచూసేవి. ఒక సినిమా హిట్ అయినా ఫట్ అయినా నెల్లూరు టాక్‌ను బట్టే వుండేది. జిల్లా స్థాయి ఉన్నతాధికారుల పరిస్థితి కూడా అంతే! ఒక కలెక్టర్ అయినా, ఎస్పీ అయినా నెల్లూరుజిల్లాలో పని చేసి సమర్థుడిగా పేరు తెచ్చుకున్నాడంటే ఆ ముద్ర జీవితాంతం వుండి పోతుంది. చెడ్డపేరు తెచ్చుకున్నా కూడా ఆ స్టాంప్ అలాగే పడిపోతుంది. యువ ఐపిఎస్ అధికారి రస్తోగికి ఎస్పీగా నెల్లూరులో ఫస్ట్ పోస్టింగ్. ఎస్పీగా తన పని తీరును ప్రదర్శించడానికి ఆయనకు చక్కని వేదిక నెల్లూరు. 1999లో ఈ జిల్లాకు కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఎస్పీగా వచ్చాడు. ఆయనకు కూడా ఎస్పీగా నెల్లూరు తొలి పోస్టింగ్! ఏడాదిన్నర కాలంలోనే ఎస్పీ అంటే ఏంటో చూపించాడు. ఆయన ఎస్పీగా పనిచేసి ఇరవై ఏళ్ళు కావస్తున్నా కూడా ఈ జిల్లా ప్రజలు ఆయనను ఇంకా గుర్తు పెట్టుకుని వున్నారంటే ఎస్పీగా ఆయన ఎంత సమర్థవంతంగా పనిచేసాడో అర్థం చేసుకో వచ్చు. ఈ జిల్లా ప్రజలు రస్తోగి నుండికూడా అలాంటి పనితీరునే ఆశిస్తున్నారు. రస్తోగి ఇంతకుముందు 3చోట్ల విధులు నిర్వహించారు. మంచి పేరే వుంది.

### ముద్ర వేసుకున్న రామకృష్ణ...

ఇక బదిలీపై వెళుతున్న పిహెచ్‌డి రామకృష్ణ జిల్లా పోలీస్ యంత్రాంగంపై ప్రత్యేకముద్ర వేసుకున్నారు. 2017 జూన్ 26వ తేదీన కడప జిల్లా నుండి బదిలీయై నెల్లూరుజిల్లా ఎస్పీగా వచ్చారు. ఆయన డైరెక్ట్ ఐపిఎస్ కాదు. పదోన్నతి ఐపిఎస్ ఆఫీసర్. ప్రమోటెడ్ ఐపిఎస్‌లలో రామకృష్ణ లాంటి ఆఫీసర్లు వుండడం చాలా అరుదు. బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లోనే తానేంటో, తన పనితీరు ఎలా వుండబోతుందో ఇటు అక్రమార్కులకు, అటు తన పోలీసు సిబ్బందికి సూచాయగా చూపించారు. రావడంతోటే క్రికెట్ బెట్టింగ్, ఎర్రచందనం, మైనింగ్ అక్రమ రవాణా ముఠాలపై పడ్డారు. బెట్టింగ్ రాయుళ్ళ బెండు తీసాడు. బెట్టింగ్ కేసుల్లో బుకీలు, పంటర్లు దాదాపు 430 మందిపై కేసులు నమోదు చేసారు. ఎన్నో ఏళ్ళ కాలంగా యధేచ్ఛగా బెట్టింగ్‌లు నిర్వహిస్తూ ఎంతో మంది కాపురాలు కూలడానికి, ఆత్మహత్యలు చేసుకోవడానికి కారణమైన బుకీలకు చుక్కలు చూపించారు. ఎర్రచందనం స్మగ్లర్‌లను వెదికి వెదికి పట్టి కేసులు పెట్టించారు. అధికార పార్టీ నేతల కనుసన్నలలో సాగుతున్న మైనింగ్ అక్రమ రవాణాకు కళ్లెం వేసాడు. ముఖ్యంగా తన శాఖపైనే ఆయన కొరడా ఝుళిపించాడు. అవినీతి, అక్రమాలకు పాల్పడే పోలీసుల గుండెల్లో గుర్రాలను దౌడు తీయించాడు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు డిఎస్పీలు, ఆరుగురు సి.ఐలు, 10మంది ఎస్సైలపైనే కాకుండా పెద్దసంఖ్యలో కానిస్టేబుళ్ళపైన కూడా క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు.

### రాజకీయ బదిలీ...

రామకృష్ణ అధికార పార్టీ వాళ్ళనే కాకుండా తన పోలీసులకు కూడా కొరకరాని కొయ్యగా మారాడు. అధికార పార్టీ నేతలు ఆయన బదిలీ కోసం ఏడాది క్రితం నుండే ప్రయత్నాలు మొదలుపెట్టారు. అయితే ఆయన ఒక్కడినే బదిలీ చేస్తే ప్రభుత్వానికి అపవాదు వస్తుందని ఇంతకాలం నెట్టుకొచ్చారు. ఇప్పుడు గుంపులో గోవింద అన్నట్లు 14మంది ఐపిఎస్‌ల బదిలీలను ఒకేసారి చేయడంతో ఆయన బదిలీకి రాజకీయ మరకలు అంటకుండా కానిచ్చేసారు.

# ద్వారకకు వైసిపి రాష్ట్రస్థాయి పదవి



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆర్యవైశ్యుల పక్షాన ఎంతో చురుకుగా పనిచేస్తున్న నెల్లూరు డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్‌కు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించాడు. వైసిపి ఆర్యవైశ్య అధ్యయన కమిటి రాష్ట్ర కన్వీనర్‌గా ద్వారకానాథ్‌ను నియమించారు. రాష్ట్ర స్థాయి పదవిలో ద్వారకను నియమించడం పట్ల ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేశారు. నెల్లూరు నగర రాజకీయాలలో ద్వారకానాథ్ ఉత్సాహంగా పాల్గొంటున్నారు. 2014 ఎన్నికల్లో నెల్లూరు నగర నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి గెలుపులో ఆయన కీలక పాత్ర పోషించారు. గతంలో మెజార్టీ ఆర్యవైశ్యులు తెలుగుదేశం మద్దతుదారులుగా వుండేవాళ్ళు. అలాంటిది ద్వారకా పార్టీలో చేరాక ఆర్యవైశ్యులలో వైసిపికి బలం పెరిగింది. నెల్లూరు జిల్లాలో జగన్ ప్రజాసంకల్ప పాదయాత్ర నిర్వ హించినప్పుడు నరసింహకొండ వద్ద ద్వారక ఆధ్వర్యంలో ఆర్యవైశ్య యువజన సదస్సు బ్రహ్మాండంగా జరిగింది. ఆరోజే జగన్ చెప్పాడు... ద్వారకకు పార్టీలో ప్రత్యేక గుర్తింపునిస్తానని... ఇప్పుడు పార్టీ రాష్ట్ర స్థాయి పదవితో గుర్తించాడు. పార్టీ అధికారంలోకి వస్తే ద్వారకకు మరింత గుర్తింపు వచ్చే అవకాశముంది.




విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో వైసిపి అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డిపై హత్యాయత్నాన్ని నిరసిస్తూ 25వ తేదీ నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు.

# హత్యాయత్నం

(మొదటి పేజీ తరువాయి)

ఎయిర్‌పోర్టు ఆవరణలోని ఫ్యూజన్ ఫుడ్స్‌లో పనిచేసే జానిపల్లి శ్రీనివాసరావు అనే యువకుడు జగన్‌పై కోడిపందేలకు వాడే కత్తితో దాడి చేసాడు. జగన్ మెడపై కత్తితో పొడవడానికి నిందితుడు ప్రయత్నించాడు. అప్పుడే అక్కడే వున్న శ్రీకాళహస్తి వైసిపి ఇన్‌ఛార్జ్ బియ్యపు మధుసూదనరెడ్డి అన్నా అంటూ... జగన్‌ను కేకేశాడు. జగన్ అప్రమత్తమై తల పక్కకు తిప్పడంతో కత్తి భుజానికి తగిలి గాయమైంది. భద్రతా సిబ్బంది వెనువెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## అభిమానినని వచ్చి...

జగన్‌పై దాడి చేయడానికి నిందితుడు శ్రీనివాసరావు పక్కా ప్లాన్‌తోనే వచ్చినట్లుగా తెలుస్తోంది. ఎయిర్‌పోర్టులో దాడి చేయడం అన్నది ఎవరి ఊహకు అందని విషయం. కాని, శ్రీనివాసరావు అక్కడే వుండే హోటల్‌లో పని చేస్తుండడంతో అతనికి సులభమైంది. శుక్రవారం కోర్టుకు హాజరు కావాల్సి వుండడంతో జగన్ గురువారం మధ్యాహ్నం పాదయాత్రను ఆపి హైదరాబాద్ వెళ్లడం కోసం విశాఖ ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. వెయిటింగ్ లాంజ్‌లో వున్న జగన్ వద్దకు వెయిటర్ శ్రీనివాసరావు వచ్చాడు. సార్, రాష్ట్రంలో మీ వేవ్ చాలా బాగుంది. ఈసారి 160 సీట్లు వస్తాయా అని అడిగాడు. తర్వాత జగన్‌తో సెల్ఫీ అడిగాడు. ఆయన సెల్ఫీకి ఓకే చెప్పగానే నిందితుడు శ్రీనివాసరావు తన ఫ్యాంటు జేబులో పెట్టుకున్న కత్తి తీసి జగన్ మెడపై పొడవబోయాడు. ఆయన తల పక్కకు తిప్పుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. జగన్‌కు ఎయిర్ పోర్టులోనే ప్రాథమిక చికిత్స చేసి హైదరాబాద్‌కు పంపారు.

## కత్తికి విషం పూసుంటే...

ఇక్కడ జగన్‌పై దాడికి వాడిన కత్తి కోడి పందేలకు వాడేదా, కోళ్ళను కోయడానికి వాడేదా అనే విషయం ప్రధానం కాదు. ఆ కత్తికి విషం పూసుంటే పరిస్థితి ఏంటి? అధికారులు దాడి చేసిన కత్తితో విషప్రయోగం లాంటిదేమన్నా చేసాడా అని పరీక్షించకుండానే జగన్‌ను విమానం ఎక్కించి హైదరాబాద్‌కు పంపించడం పూర్తిగా అధికార వైఫల్యమే!

## భద్రతా వైఫల్యం...

ఎయిర్‌పోర్టులో భద్రతా చర్యలను సిఐఎస్ఎఫ్ చూసుకుంటుంది. ప్రతి ఒక్కరినీ నిశితంగా పరీక్షిస్తారు. అలాంటి తనిఖీలుండే ఎయిర్‌పోర్టులోకి కోడిపందేలకు వాడే కత్తిని ఎలా తీసుకెళ్ళగలిగారనే అనుమానాలొస్తున్నాయి. నిందితుడు శ్రీనివాసరావు ఎయిర్‌పోర్టు లోపల హోటల్‌లో పనిచేస్తున్నాడు కాబట్టి హోటల్‌కు తీసుకెళ్లే సామానుల ద్వారా ఈ కత్తిని కూడా తీసుకెళ్లి వుండొచ్చు.

## హోటల్ టీడీపీ నేతదే...

తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరంకు చెందిన శ్రీనివాసరావు కొంత కాలంగా ఫ్యూజన్ ఫుడ్స్‌లో పనిచేస్తున్నాడు. ఈ హోటల్ విశాఖకు చెందిన టీడీపీ నాయకుడు హర్షవర్ధన్‌దేనని, ఆయన కూడా వచ్చే ఎన్నికల్లో గాజువాక సీటు రేసులో వున్నాడని తెలుస్తోంది.

## అప్పుడే మానసిక ముద్ర

జగన్‌పై అటాక్ జరిగిందో లేదో నిందితుడు శ్రీనివాసరావు నేపథ్యం, అతని అంతరంగం తెలుసుకోకుండానే తెలుగుదేశం అనుకూల మీడియా నిందితుడిపై మానసిక రుగ్మత ముద్ర వేసే ప్రయత్నం చేసింది. అతను నిజంగా మానసిక ఉన్మాదే అయితే.. గతంలో ఇలాంటి దాడులు ఎన్ని చేసి వున్నాడన్నది కూడా తెలుసుకోవాలిగా! అంత తెలివిగా జగన్‌తో మాటలు కలిపి, సీట్ల గురించి మాట్లాడి దాడి చేసాడంటేనే అతను ఎంత తెలివైనవాడో అర్థమవుతుంది.

## కారణాలు తెలుస్తాయా?

జగన్ ఆషామాషీ మనిషి కాదు... కోట్లాది మంది ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్న నాయకుడు. ఆయనకు పటిష్ట భద్రత వుంటుంది. అలాంటి నాయకుడిపై హత్యాయత్నానికి పాల్పడడం అంటే మాటలు కాదు. అందుకు తెగించాలన్నా ఏదో ఒక కారణం వుండాలి. ఎక్కడో ముమ్మిడివరంకు చెందిన జానిపల్లి శ్రీనివాసరావు అనే సాధారణ యువకుడు జగన్‌పై దాడి చేయాలనుకోవడం వెనుక కారణమేంటి? ఈయన ఆస్తులేమన్నా ఆయన లాక్కున్నాడా? వీళ్ళిద్దరికేమన్నా పాతకక్షలు వున్నాయా? జగన్‌పై దాడి చేయడం వల్ల ఇతనికొచ్చే లాభమేమన్నా వుందా? దాడి చేస్తే పట్టుకుంటారు, జైలుకు పోతాను అని తెలిసి కూడా అతను ధైర్యంగా దాడికి తెగబడ్డాడంటే ఆ ధైర్యానికి కారణం ఎవరు? అసలు ఆ నిజాలు వెలుగు చూస్తాయా?

## దుష్ట రాజకీయం...

జగన్‌పై దాడి జరిగిన తర్వాత విజ్ఞులైన నాయకులు దానిని ఖండించారు. కాని చంద్రబాబుతో సహా కొందరు తెలుగుదేశం నాయకులు వక్ర రాజకీయాలకు తెరలేపారు. దాడికి పాల్పడిన శ్రీనివాసరావు జగన్ అభిమానంటూ కొత్త వాదన తెర మీదకు తెచ్చారు. నిందితుడి ఫోటోతో జగన్‌కు శుభాకాంక్షలు చెబుతున్నట్లు ఫ్లెక్సీలు సృష్టించి సోషల్ మీడియాలో పెట్టారు.

## డిజిపి ప్రకటన అసంబద్ధం..


జగన్‌పై దాడి జరిగింది. ఎందుకు జరిగింది, దాని వెనుక కారణాలేంటి అన్నది విచారణలో తేలాలి. దానికి కొంత టైం పడుతుంది. కాని అంతలోనే డిజిపి ఠాకూర్... ఇది పబ్లిసిటీ దాడి అని ప్రకటించి తన ప్రభుత్వ భక్తిని, ముఖ్యంగా బాబు పట్ల భక్తిని చాటుకున్నారు.

## ఆందోళనలో అభిమానులు...

విశాఖ ఎయిర్‌పోర్టులో జగన్‌పై హత్యాయత్నం జరిగిందనే వార్తతో రాష్ట్రం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వై.యస్. అభిమానులు ఆందోళనకు గురయ్యారు. అన్ని రాజకీయ పక్షాలు జగన్‌పై దాడిని తీవ్రంగా ఖండించాయి. జగన్‌పై దాడి కేసు లోతుగా విచారణ జరిపితేగాని నిజాలు వెలుగులోకి రావు. ఆ నిజాలు వెలుగు చూస్తాయా? లేక చీకట్లోకి నెట్టబడతాయో చూద్దాం!.



జగన్‌పై హత్యాయత్నాని నిరసిస్తూ గురువారం నెల్లూరు కరెంట్ ఆఫీసు సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైసిపి కార్యకర్తలు

# చతుర్థ వర్ధంతి



అందరి హృదయాలలో సుస్థిర స్థానమేర్పరుచుకుని,
నిండు నూరేళ్ళు పరిపూర్ణ జీవితాన్ని సాగించిన ప్రేమానురాగాల దీప్తి,
మా అభివృద్ధికి కారకురాలు, దైవసమానులు

## కీ॥శే॥ శ్రీమతి గునుపాటి రుక్మిణమ్మ గారు

పరమపదించి తేది 30-10-2018 నాటికి
నాలుగేళ్ళు పూర్తికానున్న సందర్భంగా వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని
ఆ భగవంతుని ప్రార్థిస్తూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము

**కుమారులు – కోడళ్ళు**
గునుపాటి వెంకటకృష్ణారెడ్డి – ఇందిరమ్మ
గునుపాటి జనార్ధన్‌రెడ్డి – సునీతమ్మ
గునుపాటి రామ్‌మోహన్ రెడ్డి – శుభప్రదమ్మ

**కుమార్తెలు – అల్లుళ్ళు**
కోటిరెడ్డి నిర్మలమ్మ – కీ॥శే॥ కోటిరెడ్డి రామచంద్రారెడ్డి
అత్తివరపు విమలమ్మ – అత్తివరపు రామచంద్రారెడ్డి
దొడ్ల లలితమ్మ – దొడ్ల పద్మనాభరెడ్డి

మరియు
**మనుమలు, మనుమరాళ్ళు, ముదిమనుమలు, ముదిమనుమరాళ్ళు**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com